సహజీవన భావనల పావురాయి

# పావురాయి

వారపత్రిక 1-11-2024 15/-

# జనం ఘనం ధనం








సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY
Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in
సంపుటి: 46 సంచిక: 44 హైదరాబాద్
శుక్రవారం 1 నవంబర్ 2024 రూ.15-00
28 రబీ ఉస్సాని 1446 హిజ్రీ

**తొలిగీటు**

ఎవరయినా తన బానిసను
అకారణంగా కొడితే
ప్రళయదినాన అతనిపై
ప్రతీకారం తీర్చుకోబడుతుంది.

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**



కథ

16

## జీవిత పరమార్థం

## లోపల...

| | | |
|---|---|---|
| న్యాయం | ...... | 04 |
| జనం ఘనం ధనం | ...... | 05 |
| దేవుని బెబ్బులి!! – 52 | ...... | 08 |
| మరణానంతర జీవితం | ...... | 12 |
| చరితార్థులు-2 : మౌలానా ముహమ్మద్ మియాఁ మన్సూర్ అన్సారి | ...... | 15 |
| వెలుగుబాట (తఫ్హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| భారత ముస్లిములు – బాధ్యతలు | ...... | 20 |
| గుజరాత్ మరచిపోయిన ఇస్లామిక్ చరిత్ర | ...... | 23 |
| అప్పు : తప్పు-ముప్పు | ...... | 24 |
| అందరి ప్రవక్త ముహమ్మద్ (స) – రిపోర్టు | ...... | 27 |
| పావలా మహత్యం | ...... | 28 |
| విద్య వెలుగు | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| సామాజిక స్పృహ | ...... | 34 |

**ఛీ.. మీ బతుకు చెడ...**




కొంతమంది నేతలకు
ఉండదేమొ సిగ్గుఎగ్గు
సోయెందుకు ఉండదో
యేస్తారేమొ పెగ్గు!
సంస్కారం ఊసుండదు
సభ్యతకు చోటుండదు
నోటికి యెంతొస్తె అంత
తగ్గుడన్న మాటుండదు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## న్యాయం

**భారత న్యాయ వ్యవస్థలో** ముస్లిముల ప్రాతినిధ్యం ఎంత? ఈ ప్రశ్నకు జవాబు చూస్తే చాలా నిరుత్సాహం కలుగుతుంది. భారతసంవిధానాన్ని కాపాడేది న్యాయ వ్యవస్థ. బడుగు బలహీనవర్గాల హక్కులను కాపాడేది న్యాయవ్యవస్థ. కాని గత 75 సంవత్సరాలుగా ముస్లిముల ప్రాతినిధ్యం న్యాయవ్యవస్థలో చాలా తక్కువ. మొత్తం 35 మంది న్యాయశాఖ మంత్రుల్లో కేవలం ఒక్క సల్మాన్ ఖుర్షిద్ మాత్రమే ముస్లిం. సుప్రీంకోర్టుకు చెందిన 50 మంది ప్రధాన న్యాయమూర్తుల్లో కేవలం నలుగురు మాత్రమే ముస్లిములు. జస్టిస్ ముహమ్మద్ హిదాయతుల్లా, జస్టిస్ మీర్జా అహ్మదుల్లా బేగ్, జస్టిస్ అజీజ్ ముషబ్బర్ అహ్మదీ, జస్టిస్ అహ్మద్ కబీర్. సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్స్, రిజిస్ట్రార్లలో ముస్లిములెవ్వరు లేరు. 256 మంది సుప్రీంకోర్టు న్యాయ మూర్తుల్లో కేవలం 16 మంది ముస్లిములు. మొత్తం 677 మంది హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల్లో కేవలం 39 మంది ముస్లిములు. అలాగే మొత్తం 3649 న్యాయమూర్తుల్లో కేవలం 207 మంది ముస్లిములు. సుప్రీంకోర్టులోని 436 మంది సీనియర్ న్యాయవాదుల్లో కేవలం 28 మంది ముస్లిములు. లోక్‌పాల్‌లో ముస్లిములు లేరు, 112 మంది లోకాయుక్తల్లో 5 గురు మాత్రమే ముస్లిములు. మొత్తం న్యాయవ్యవస్థలోనే ఈ పరిస్థితి కనిపిస్తుంది. 13,034 మంది నోటరీల్లో 684 మంది ముస్లిములు. లా కమీషన్ ఛైర్ పర్సన్లలో ఒక్కరు లేరు. జియస్టీ ప్రాక్టీషనర్లు95,121 మందిలో 11,074 మంది ముస్లిములు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో ముస్లిములు లేరు. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ 81 మంది సభ్యుల్లో ఇద్దరు ముస్లిములు. 16,994 మంది జిల్లా సెషన్స్ జడ్జీల్లో కేవలం 1,034 మంది ముస్లిములు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీలో ముస్లిముల ప్రాతినిధ్యం లేదు. రాష్ట్రాల లీగల్ సర్వీసెస్ అథారిటీల్లో 2258 మంది సభ్యుల్లో 101 మంది ముస్లిములు.

మైనారిటీ సముదాయానికి చెందిన యువతకు నియామకాలు ఉండవని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ గోవింద్ మాథుర్ రిటైరైన తర్వాత చేసిన వ్యాఖ్యలో సత్యం ఎంతైనా ఉంది. ఇండియన్ ఎక్స్ ప్రెస్ మే 17, 2021 ఇంటర్నెట్ ఎడిషన్ లో ఈ ఇంటర్వ్యూ ప్రచురితమయ్యింది.

దేశంలో దాదాపు 15 శాతం ముస్లిములున్నారు. కాని న్యాయవ్యవస్థలో వారి ప్రాతినిధ్యం చాలా తక్కువ. ఈ పరిస్థితికి కారణం ప్రభుత్వమే అని చెప్పడం కూడా సరికాదు. కొలిజియం బాధ్యత కూడా కాదనలేం. న్యాయవ్యవస్థలో అన్ని సముదాయాలకు తగిన ప్రాతినిధ్యం ఉండడం లౌకిక ప్రజాస్వామిక వ్యవస్థలో ఎంతైనా అవసరం. మన న్యాయవ్యవస్థలో ముస్లిం లేదా ముస్లిమేతర న్యాయమూర్తులు ఉండరు. మన న్యాయమూర్తులు తటస్థ వైఖరి కలిగిన వారు. ఇక్కడ అమెరికాలా రిపబ్లికన్, డెమొక్రాట్ న్యాయమూర్తులుండే అవకాశం లేదు అని ఫైజాన్ ముస్తఫా సరిగానే చెప్పారు. నుపుర్ శర్మ కేసులో జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ పర్దీవాలాలు తీక్షణమైన వ్యాఖ్యలు చేసి న్యాయవ్యవస్థ నిష్పాక్షికతకు నిదర్శనంగా నిలిచారన్నది కూడా నిజమే. అలాగే మస్జిదులో జై శ్రీరామ్ అంటే తప్పేమిటి అని అడిగిన న్యాయమూర్తులు కూడా ఉన్నారన్నది మరిచిపోరాదు. అందువల్ల న్యాయవ్యవస్థలో అన్ని సముదాయాలకు – స్త్రీలకు, మైనారిటీలకు, దళితులకు, ఆదివాసీలకు అందరికి ప్రాతినిధ్యం కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అబ్దుల్ వాహెద్

# జనం ఘనం ధనం



**జనాభా నియంత్రణ** నిన్న మొన్నటి వరకు ప్రభుత్వాలకు ఎంతో ముద్దు. ఇప్పుడు మాత్రం జనాభా నియంత్రణ వద్దు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎలాంటి శషభిషలు లేకుండా జనాభా నియంత్రణ వద్దంటే వద్దన్నారు. ఇద్దరు కాదు సాధ్యమైనంత ఎక్కువ మంది పిల్లల్ని కనాలని, లేకపోతే పెనుప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు. రాబోయే రోజుల్లో దేశంలో వృద్ధుల జనాభా పెరిగిపోతుందని, యువకుల జనాభా తగ్గిపోతుందని, దేశహితం కోసం ఎక్కువ మంది పిల్లల్ని కనాలని చెప్పారు.

ఇందులో మరో కోణం కూడా ఉంది. దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ మొదలయ్యింది. త్వరలో జనగణన చేపట్టి, కొత్త జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజకవర్గాలను కేంద్రం పునర్విభజన చేయనుందనే ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుంది. లోక్‌సభతో పాటు దేశ రాజకీయాల్లో ఉత్తరాది రాష్ట్రాల ప్రాబల్యం పెరుగుతుంది. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ అదే మాట చెప్పారు. ఇప్పుడు చిన్న కుటుంబం వద్దని, 16 మంది పిల్లలను కని, పెంచాలని ప్రజలు అనుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే తమిళనాడు సహా జనాభా నియంత్రణ పద్ధతులను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే అభిప్రాయాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

చంద్రబాబు నాయుడు, స్టాలిన్ ఇద్దరు ఈ వ్యాఖ్యలు కేవలం 48 గంటల వ్యవధిలో చేశారు. ఇందులో చంద్రబాబు నాయుడు ఎన్డీయేలో కీలక పార్టీకి అధినేత. దక్షిణ భారతదేశంలో వృద్ధుల

జనాభా పెరుగుతుందని నాయుడు ఆందోళన వ్యక్తం చేస్తే, 2026లో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన వల్ల లోక్‌సభ సీట్ల ప్రాతినిధ్యంలో అన్యాయం జరుగుతుందనే కోణాన్ని కూడా స్టాలిన్ ప్రస్తావించారు. ఈ ఇద్దరు నేతల మాటలను నిశితంగా పరిశీలించడం అవసరం. ఎందుకంటే, భారతదేశంలో జననాల రేటు తగ్గడమే కాదు, వృద్ధ జనాభా పెరుగుతుందన్నది ఒక వాస్తవం.

యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (UNFPA), ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ (IIPS) కలిసి 2023లో రూపొందించిన "ఇండియా ఏజింగ్ రిపోర్ట్" ప్రకారం, 2050 నాటికి భారత జనాభాలో వృద్ధుల (60 ఏళ్లు పైబడినవారే) శాతం 20 కన్నా ఎక్కువ ఉంటుందని అంచనా. 2022 నుండి 2050 వరకు భారతదేశం మొత్తం జనాభా 18 శాతం పెరిగితే, వృద్ధుల జనాభా 134 శాతం పెరుగుతుందని నివేదిక పేర్కొంది. ఈ ప్రభావం దక్షిణ రాష్ట్రాల్లో మరింత ఎక్కువగా ఉంటుంది.

జనాభా నియంత్రణను చక్కగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు అందుకు శిక్ష అనుభవించే పరిస్థితి ఇప్పుడు వచ్చిందా? చంద్రబాబు నాయుడు ఇంతకు ముందు కూడా ఈ ఆందోళన వ్యక్తం చేశారు. 2024 జూలైలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన నిర్వహించిన నీతి ఆయోగ్ తొమ్మిదవ సమావేశంలో చంద్రబాబు నాయుడు జనాభా విషయంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం స్వంత విధానం రూపొందించుకోవాలని చెప్పారు.

డేటా ప్రకారం, దక్షిణ రాష్ట్రాలు కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వృద్ధుల జనాభా 2021 నుండి 2036 వరకు మొత్తం జనాభాలో 6-7 శాతం పెరుగుతుంది. కానీ ఉత్తర ప్రదేశ్, బీహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో ఈ పెరుగుదల 3-4 శాతం మాత్రమే ఉంటుంది. 2021లో కేరళలో వృద్ధుల జనాభా 16.5 శాతం ఉండగా, 2036 నాటికి ఇది 22.8 శాతానికి పెరిగే అవకాశముంది, అంటే 6.3 శాతం పెరుగుదల. ఇక తమిళనాడులో వృద్ధుల జనాభా 13.7 శాతం నుండి 20.8 శాతానికి చేరుకుంటుంది, ఇది భారతదేశంలోనే అత్యధికం, అంటే పెరుగుదల7.1 శాతం. కాని ఉత్తర ప్రదేశ్‌లో వృద్ధుల జనాభా 8.1 శాతం నుండి 11.9 అంటే కేవలం 3.8 శాతం పెరుగుదల మాత్రమే. 15 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న ప్రతి 100 మంది పిల్లలకు వృద్ధులకు నిష్పత్తిని చూసినా దక్షిణ భారతదేశం పరిస్థితి చింతాజనకమే. దక్షిణ భారతదేశంలో, ప్రతి 100 మంది పిల్లలకు 61.7 మంది వృద్ధులు ఉన్నారు. ఉత్తర భారతదేశంలో ఇది 38.9 శాతం మాత్రమే. మధ్య భారతదేశంలో ఇది 27.8 మాత్రమే.

కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కింద జనాభా అంచనాలపై సాంకేతిక బృందం 2019 నవంబర్‌లో విడుదల చేసిన నివేదిక ప్రకారం, 2011 నుండి 2036 వరకు భారత జనాభా 31.1 కోట్ల వరకు పెరుగుతుంది. ఈ పెరుగుదలలో సగానికి పైగా ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ వంటి రాష్ట్రాల్లో నమోదవుతుంది. దక్షిణ రాష్ట్రాల్లో ఈ పెరుగుదల కేవలం 9 శాతమే, అంటే 2.9 కోట్లు మాత్రమే అని నివేదిక పేర్కొంది.

సీనియర్ జనాభాశాస్త్రవేత్త శ్రీనివాస్ గోలి అంతర్జాతీయ సంస్థ (IIPS)లో అసోసియేట్ ప్రొఫెసర్, దక్షిణ భారతదేశంలో తక్కువ సంతానోత్పత్తి రేట్లు "తీవ్ర ఆందోళన" కలిగిస్తున్నాయని ఆయన చెప్పారు. ఫ్రాన్స్‌కు తక్కువ సంతానోత్పత్తి రేటు సాధించడానికి 285 సంవత్సరాలు పట్టింది, ఇంగ్లాండ్‌కు 225 సంవత్సరాలు, కానీ భారతదేశం 45 ఏళ్లలోనే ఈ స్థాయికి చేరుకుంది.

ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్ 2004లో Replacement Level of Fertility చేరుకుంది. కేరళ 1998లోనే దీనిని సాధించింది, తమిళనాడు 2000లో దీనిని సాధించింది.

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ లాంటి రాష్ట్రాలు, దేశంలోని మిగిలిన ప్రాంతాల కంటే త్వరగా తక్కువ సంతానోత్పత్తి స్థాయిని చేరుకున్నాయి. దీనివల్ల వృద్ధ జనాభా పెరిగి, అభివృద్ధి కుంటు పడుతుంది. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు ఎక్కువ కాలం పాటు అభివృద్ధి చెందుతాయి, కానీ కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు 2040 తర్వాత అభివృద్ధిలో వెనుకబడిపోతాయని నిపుణులు అంటున్నారు.డేటా ప్రకారం, దక్షిణ భారత దేశంలో సగటు ఆయుష్షు జాతీయ సగటు 68.2 సంవత్సరాల కంటే ఎక్కువగా ఉంది. నాయుడు, స్టాలిన్‌లు ప్రకటించిన ఆందోళనలో వాస్తవముంది. దక్షిణాది రాష్ట్రాల్లో జననాల రేటు తగ్గుతోంది. సగటు ఆయుష్షు పెరుగుతోంది. వృద్ధ జనాభా పెరుగుతోంది. వృద్ధ జనాభా పెరగడం వల్ల సామాజిక భద్రత, ఆర్థిక భారాలు పెరుగుతాయి. ఆర్థిక అభివృద్ధికి ఇది అడ్డంకిగా ఉంటుంది. పని చేయగలిగిన యువకుల సంఖ్య కన్నా, ఆధార పడే వృద్ధుల జనాభా ఎక్కువవుతుంది. అంటే ఉత్పాదక శక్తి కన్నా వినిమయదారులు ఎక్కువవుతారు. పైగా దక్షిణ భారత రాష్ట్రాలు తక్కువ జనాభా కారణంగా కేంద్ర ప్రభుత్వం నుండి

వచ్చే వాటాను కోల్పోతాయి, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత పార్లమెంటరీ ప్రతినిధులు కూడా తగ్గిపోతారు. భారతదేశ ఆదాయానికి దక్షిణాది రాష్ట్రాలు అందించేది ఎక్కువగాను, పొందేది తక్కువగాను ఉంటుంది. ఫైనాన్స్ కమిషన్ విధానంలో ఇది స్పష్టంగా ఉంది. ఈ ఏడాది, ఉత్తరప్రదేశ్‌కు రూ. 31,962 కోట్లు కేటాయించారు. దక్షిణ భారత ఐదు రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ. 28,152 కోట్లు.

నియోజకవర్గాల పునర్విభజనపై భయం కూడా ఉంది. అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ సీట్లు 25 నుండి 20కి తగ్గవచ్చని, తమిళనాడు 39 నుండి 30కి, కర్ణాటక 28 నుండి 26కి, కేరళ 20 నుండి 14కి, తెలంగాణ 17 నుండి 15కి తగ్గవచ్చని భావిస్తున్నారు.

జాతీయ జనాభా విధానం ప్రవేశపెట్టబడినప్పుడు, అన్ని రాష్ట్రాలకు సమానంగా లక్ష్యాలు ఇచ్చారు. దక్షిణ భారతదేశానికి, ఉత్తర భారతదేశానికి వేరుగా ఇవ్వలేదు. దక్షిణ రాష్ట్రాలు క్రమ శిక్షణతో అమలు చేశాయి. దానికి శిక్ష అనుభవించే పరిస్థితి ఇప్పుడు వచ్చింది.

ఒకప్పుడు చైనా కూడా అత్యంత కఠినంగా వన్ ఫ్యామిలీ వన్ చైల్డ్ విధానం అమలు చేసింది. ఇప్పుడు ప్లీజ్.. పెళ్లి చేసుకోండి, పిల్లల్ని కనండి, అవసరమైతే మెటర్నిటీ లీవులు ఇస్తాం అని బతిమాలుతోంది. ఎందుకంటే వృద్ధుల జనాభా మాత్రమే పెరగడం ప్రారంభమైంది. దాంతో చైనా ఆర్థికంగా కుదేలయ్యే స్థితి వచ్చింది. ఇక జపాన్ పరిస్థితి కూడా అదే. ఫిన్లాండ్ విషయానికి వస్తే, ప్రపంచంలోనే ప్రజలు అత్యంత సంతోషంగా ఉన్న దేశం అంటారు. కాని యువకులు చాలా తక్కువగా ఉన్న దేశం. 2030 నాటికి ఫిన్లాండ్ దేశంలో 47 శాతం మందికి పైగా ప్రజలు 65 సంవత్సరాలు పైబడిన వాళ్ళే ఉంటారు. జపాన్ తర్వాత 65 సంవత్సరాలు దాటిన వారు ఎక్కువగా ఉన్న దేశం ఫిన్లాండ్. కేవలం వృద్ధుల దేశంగా మిగులుతుంది. యువకుల జనాభా తగ్గడానికి కారణం, పిల్లల్ని కనకపోవడమే. కొరియాతో పాటు జపాన్, చైనాలోనూ పెళ్లి, పిల్లలపై యువతలో ఆసక్తే లేదు. ఒంటరి బతుకే బెటర్ అంటున్నారు. పెళ్లి చేసుకుంటే కుటుంబ భారం మోయాలి. పిల్లల్ని కనాలి, ఫ్యామిలీని చూసుకోవాలి, బండెడు చాకిరీ చేయాలి. అదే పెళ్లి చేసుకోకపోతే హాయిగా బతికేయవచ్చను కుంటున్నారు. ఈ ఆలోచనా విధానానికి కారణమేమిటి?

భారతదేశంలో కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు నిజానికి స్వాతంత్ర్యం పొందిన కాలం నుండి ప్రారంభమయ్యాయి. వాస్తవానికి, జనాభా వృద్ధి రేటును తగ్గించడానికి కుటుంబ నియంత్రణ పథకాన్ని ప్రవేశపెట్టిన తొలి దేశాలలో భారతదేశం కూడా ఒకటి. కాని ఇప్పుడు జనాభా, జననాల రేటు ఎన్నికల రాజకీయాల్లో వివాదాస్పద అంశాలుగా మారిపోయాయి.

2019 జూలైలో, బీజేపీ ఎంపీ రాకేష్ సిన్హా రాజ్యసభలో జనాభా నియంత్రణ బిల్లు ప్రవేశపెట్టాడు. దంపతులు ఖచ్చితంగా ఇద్దరు పిల్లలు మాత్రమే కలిగి ఉండే విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించాడు. కాని, 2023 ప్రారంభంలో బీజేపీకి చెందిన కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ స్వయంగా ఈ బిల్లును ఉపసంహరించేలా చేశాడు.

నిపుణులు కూడా ప్రతి జంటకు పిల్లల సంఖ్యను నిర్ధారించే విధానం అవసరం లేదని ఇప్పుడు అంగీకరిస్తున్నారు. తమిళ నాడు విషయాన్ని తీసుకుంటే, గత 10–12 సంవత్సరాలుగా అక్కడి జననాల రేటు తగ్గుతూ వస్తోంది. 2031 నుండి అక్కడ జనాభా బాగా తగ్గడం ప్రారంభమవుతుంది. త్వరలోనే కేరళలో కూడా జనాభా తగ్గుతుందని పలువురు వివరిస్తున్నారు.

భారత ఉపఖండంలో జనాభా సమస్య అనే చర్చ 20వ శతాబ్దం మూడవ దశకంలో మాత్రమే మొదలైంది. బ్రిటిష్ పరిపాలనలో ముఖ్యంగా 1860, 70 దశకాల వరకు ఇక్కడ అధిక జనాభా అన్న చర్చే లేదు. పైగా జనాభా తక్కువగా ఉందనే అభిప్రాయం ఉండేదని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో జనాభా అధ్యయనాల ప్రొఫెసర్ ఎమెరిటస్ టిమ్ డైసన్ ఒక సందర్భంలో చెప్పారు.

శ్రీనివాసన్ రాసిన పుస్తకం Population Concerns in India: Shifting Trends, Policies, and Programsలో పేర్కొన్నట్లు, 1911 నుండి 1921 మధ్య భారతదేశ జనాభా, 1918–19 లో వచ్చిన ప్రపంచవ్యాప్త మహమ్మారి కారణంగా 252.1 మిలియన్ల నుండి 251.3 మిలియన్లకు తగ్గింది. 1921 నుండి మాత్రమే కొన్ని ప్రభుత్వ చర్యల కారణంగా జనాభా పెరుగుదల మొదలైంది. జనాభా పెరుగుదలపై మేధావులు, సమాజ సంస్కర్తలతో పాటు అప్పట్లో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వాల్లో ఆందోళన మొదలైందని శ్రీనివాసన్ రాశారు. దీనికి కారణమేమిటంటే, ఇరవయ్యవ శతాబ్దిలోని తొలి రెండు దశాబ్దాలలో భారతదేశం నుంచి ఇంగ్లాండ్‌కు ఉన్నత విద్య

కోసం వెళ్ళిన వారు అక్కడ జనాభాకు సంబంధించి మాల్థస్ జనాభా సిద్ధాంత ప్రభావానికి గురయ్యారు. యూరప్‌లోని నియో-మాల్థూసియన్ సంస్థల ప్రభావానికి లోనయ్యారు.

చరిత్రకారుడు మాథ్యూ కానెల్లీ రాసిన వ్యాసం Population Control in India: Prologue to the Emergency Periodలో, భారత మేధావులు, ముఖ్యంగా హిందూ ఉన్నత కులాలకు చెందిన వారు అధిక జనాభాపై జరిగే అంతర్జాతీయ సదస్సుల్లో చాలా చురుగ్గా పాల్గొన్నారని రాశారు. జనాభా నియంత్రణను ఈ వర్గాలు బలంగా సమర్థించడానికి కారణమేమిటంటే, దిగువ కులాలు, ముస్లింల జనాభా పెరుగుతుందన్న భయాలని ఆయన రాశారు. 1920లలో, అమెరికన్, బ్రిటిష్ మేధావులు 'రైజింగ్ టైడ్ ఆఫ్ కలర్' గురించి హెచ్చరించడం ప్రారంభమైంది. అప్పట్లో జనాభా వేగంగా పెరుగుతోందనే ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ, జనాభా చర్చ ప్రారంభించారు. భారతదేశం వంటి అధికజనాభా దేశం ప్రపంచానికి భారం అవుతుందనే వాదనలు ముందుకు వచ్చాయి. అందువల్ల మహిళలకు కుటుంబ నియంత్రణ పద్ధతులను ప్రోత్సహించాలనే వాదన బలం పుంజుకుంది.

భారతదేశంలో కుటుంబ నియంత్రణ గురించి మొదట మాట్లాడిన వ్యక్తి ప్యారే కిషన్ వట్టాల్. 1916లో ఆయన రాసిన పుస్తకం The Population Problem in Indiaలో పరిమిత కుటుంబాన్ని ప్రోత్సహించారు. ఇండియన్ ఎక్స్ ప్రెస్ ఏప్రిల్ 19, 2023 వెబ్ ఎడిషన్‌లో దీనికి సంబంధించిన వ్యాసం ఉంది.

వాస్తవమేమిటంటే, సరైన నెరెటివ్ సమాజంలో లేకపోతే ఇలాంటి పరిస్థితులే ఏర్పడతాయి. అధిక జనాభా అన్ని సమస్యలకు కారణమని జనాభా నియంత్రణ తీసుకొచ్చారు. కాని అనేకానేక సామాజిక కారణాల వల్ల ప్రజల్లో వ్యతిరేకత ఉండేది. ఆ వ్యతిరేకతను తగ్గించడానికి చేసిన ప్రయత్నాలతో చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అనే సామాజిక నెరెటివ్ బలపడేలా చేశారు. ఇప్పుడు సామాజిక ఆలోచనా సరళిలోనే ఈ నెరెటివ్ ఉన్నప్పుడు జనాభా పెంచాలని, ఎక్కువ పిల్లలు కనాలని చెప్పినా ప్రజల్లో ప్రతిస్పందన రాదు. ఇదే పరిస్థితి యూరప్ దేశాల్లో చైనా, జపాన్‌లోనూ కనిపిస్తుంది.

1798లో థామస్ రాబర్ట్ మాల్థస్ "అన్ ఎస్సే ఆన్ ది ప్రిన్సిపల్ ఆఫ్ పాపులేషన్" అనే వ్యాసాన్ని వ్రాశాడు, ఇది జనాభా పెరుగుదల పట్ల భయాన్ని సృష్టించిన మొదటి రచన. జనాభా పెరిగిపోతే నిరుద్యోగం, కరువు, ఆకలి బాధలు తప్పవని అతను హెచ్చరించాడు. ఆ తర్వాత రెండు శతాబ్దాల పాటు మాల్థస్ వాదనలకు అనుకూలంగా, వ్యతిరేకంగా చర్చోపచర్చలు జరిగాయి. 19వ శతాబ్దపు ఆర్థిక శాస్త్రవేత్త హెన్రీ చార్లెస్ కార్, మాల్థస్ సిద్ధాంతాలను తీవ్రంగా విమర్శించగా, 19వ శతాబ్దపు ప్రఖ్యాత 'యుటిలిటేరియనిజం' రచయిత జాన్ స్టువర్ట్ మిల్, మాల్థస్ వాదనలను బలంగా సమర్థించాడు.

ఎంగెల్స్ పొలిటికల్ ఎకానమీపై రచనలో మాల్థస్ సిద్ధాంతాన్ని క్రూరమైన సిద్ధాంతం అన్నాడు. మాల్థస్ సిద్ధాంతం తప్పుల తడక అని వాస్తవాలు నిరూపిస్తున్నాయి. మాల్థస్ 1798లో తన పుస్తకం వ్రాసినప్పుడు, ప్రపంచ జనాభా సుమారు 90 మిలియన్లు మాత్రమే. రెండు శతాబ్దాలలో, ఇది సుమారు ఏడొందల కోట్లకు చేరింది. మాల్థస్ అభిప్రాయాలు సరయినవి అయితే, ప్రపంచం ఈరోజు ఇలా ఉండేది కాదు. కరువు, నిరుద్యోగం, వ్యాధులు మానవాళిని నాశనం చేసేవి. ఈ రెండు శతాబ్దాలలో జనాభా వృద్ధి కారణంగా మనిషికి కరువు దొరకలేదు, సిరి దొరికింది. జనాభా పెరుగుదల ప్రగతికి దారి తీస్తుందని స్పష్టమయ్యింది. మాల్థస్ జీవించిన కాలంలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం వేరు, తర్వాతి శాస్త్రీయ ప్రగతి వేరు. మానవ జనాభా పెరిగేకొద్దీ, సృష్టికర్త వారికి జీవించడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను అందిస్తాడు.

సృష్టికర్త భూమిపై ఉన్న అన్ని జీవులకు అవసరమైన వనరులను సిద్ధం చేసాడనేది ఇస్లామీయ విశ్వాసం. అందువల్లనే బలవంతపు కుటుంబ నియంత్రణను ముస్లిములు వ్యతిరేకిస్తూనే వచ్చారు. ఇస్లామీయ దృక్పథం ప్రకారం జనాభా నియంత్రణ ముఖ్యం కాదు, మానవ వనరులను సరైన విధంగా, ప్రణాళికా బద్ధంగా వినియోగించుకోవడం ముఖ్యం. ఆ విధంగానే ప్రగతి సాధించగలం.

పేదరికం భయంతో తమ బిడ్డలను చంపిన అరబ్బులకు ఖురాన్ ఏమందంటే:

"పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని హత్య చేయకండి. మేము వారికీ ఉపాధిని ఇస్తాము, మీకూ ఇస్తాము. వాస్తవానికి వారిని హత్య చేయటం ఒక పెద్ద నేరం." (17:31).

"అల్లాహ్ స్వయంగా ఉపాధి ప్రదాత, గొప్ప శక్తిసంపన్నుడు, అత్యంత దృఢమైనవాడూను." (51:58).

1968లో అమెరికన్ జీవశాస్త్రవేత్తలు పాల్ ఎల్. ఎర్లిచ్, ఆయన భార్య యాన్నే హెచ్. ఎల్. రిచ్ "పాపులేషన్ బాంబ్" అనే పుస్తకాన్ని రాశారు. కాని తర్వాతి కాలంలో వారి అంచనాలు అన్నీ తప్పయ్యాయి.

అనియంత్రిత జనాభా ఆహార కొరతకు దారితీస్తుందన్న వాదన కూడా పైకి అర్థవంతమైన వాదనలా కనిపించినప్పటికీ, వాస్తవాలు వేరుగా ఉన్నాయి. 1998లో యునైటెడ్ నేషన్స్ ప్రచురించిన వరల్డ్ పాప్యులేషన్ ప్రాస్పెక్ట్స్ ప్రకారం, 1830లో జనాభా 100 మిలియన్లు, 1930లో 200 మిలియన్లు, 1960లో 300 మిలియన్లు, 1975లో 400 మిలియన్లు, 1987లో 500 మిలియన్లు, 1999లో 600 మిలియన్లు. అదే సంవత్సరం UNDP హ్యూమన్ డెవలప్మెంట్ రిపోర్ట్‌ను పరిశీలిస్తే, 1950లో జనాభా 252 కోట్లుగా ఉండగా, భూమిపై ఆహార ధాన్యాల ఉత్పత్తి 62.4 కోట్ల మెట్రిక్ టన్నులు. 1990లో జనాభా 520 కోట్లకు పెరిగినప్పుడు, ఆహార ఉత్పత్తి 180 కోట్ల మెట్రిక్ టన్నులకు పెరిగింది. వాస్తవం ఏమిటంటే, జనాభా రెట్టింపు అయినప్పుడు, ఆహార ఉత్పత్తి మూడు రెట్లు పెరిగింది. జనాభా రెట్టింపు అయినప్పటికీ సరైన పంపిణీ వ్యవస్థ ఉంటే, 1990లో ప్రతి వ్యక్తికి 1950లో కంటే సగటున ఎక్కువ ఆహార ధాన్యాలు లభించాయి. జనాభా వృద్ధి ఆహార కొరతను కలిగిస్తుందని భావించే వారు మానవ వనరుల అనంతమైన అవకాశాలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. "మేమే వారికి, మీకూ ఉపాధిని ఇస్తాము" (17:31) అన్నాడు సృష్టికర్త.

జనాభా వృద్ధి వల్ల వ్యాధులు పెరుగుతాయి, ఆయుష్షు తగ్గుతుందన్న వాదన కూడా తప్పయ్యింది. జనాభా పెరిగేకొద్దీ, జీవన స్థాయి మెరుగవ్వడం, వ్యాధులు తగ్గడం, ఆయుష్షు పెరగడం మనం చూస్తున్నాం. భారతదేశంలో జనాభా వృద్ధి, సగటు ఆయుర్ధాయంపై అప్లైడ్ మ్యాన్‌పవర్ రీసెర్చ్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్ ప్రచురించిన డేటా ప్రకారం, 1901లో జనాభా 23.8 కోట్లు ఉన్నప్పుడు భారతీయుల సగటు జీవన ఆయుష్షు 24 సంవత్సరాలు. 1941లో జనాభా 31.9 కోట్లు ఉన్నప్పుడు సగటు ఆయుష్షు 31 సంవత్సరాలు. 1981లో జనాభా 68.3 కోట్లు ఉన్నప్పుడు ఇది 55 సంవత్సరాలు. 2004లో జనాభా 102 కోట్లు ఉన్నప్పుడు సగటు జీవన ఆయుష్షు 62 సంవత్సరాలు. జనాభా పెరిగేకొద్దీ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవ్వడంతో ఆరోగ్యం మెరుగవుతుంది, వ్యాధులు తగ్గుతాయి. పిల్లలు, యువకుల మరణాల రేటు తగ్గుతుంది.

అధిక జనాభా తలసరి ఆదాయాన్ని తగ్గిస్తుందన్న వాదన కూడా నిలబడేది కాదు. 2002లో పాపులేషన్ రిఫరెన్స్ బ్యూరో ప్రచురించిన వరల్డ్ పాపులేషన్ ఫ్యాక్ట్ షీట్ ప్రకారం, కాంగో, సోమాలియా, మాలీ, నైజర్ వంటి దేశాలు అతి తక్కువ జన కలిగిన దేశాలు. కాని వీటి తలసరి ఆదాయాలు వరుసగా 570, 600, 780, 740 డాలర్లు. కానీ, అత్యధిక జనసాంద్రత కలిగిన ప్రాంతాలు మాకావు, సింగపూర్, హాంకాంగ్ అత్యధిక తలసరి ఆదాయాలను కలిగి ఉన్నాయి. ఉదాహరణకు, సింగపూర్‌లో జనసాంద్రత 6,815గా ఉండగా, తలసరి ఆదాయం $ 24,910.

జనసాంద్రత పెరిగేకొద్దీ ఉత్పాదకత, తలసరి ఆదాయం కూడా పెరుగుతుంది. ఈ గణాంకాలు చూస్తే జనాభా నియంత్రణ కాదు, జనాభాను ప్రోత్సహించడం అవసరమని తెలుస్తోంది.

ప్రభుత్వాలు మానవ వనరులను సానుకూలంగా చూడాలి. ప్రణాళికల ద్వారా ప్రజలు లాభపడే ప్రాజెక్టులను రూపొందించాలి. వనరుల కోసం, వనరుల పంపిణీ కోసం మనుషులను శత్రువులుగా చూసే ఆలోచనా ధోరణి సమాజానికి స్థిరమైన జీవన విధానాన్ని అందించలేదు. 'జనాభా పేలుడు' అనే భావనలు మంచి చేశాయా? చెడు చేశాయా అనేది ఆలోచించాలి. జనాభాను తగ్గించడం వల్ల పురోగతి సాధించవచ్చనేది తప్పుడు భావన మనుషులను కేవలం వినియోగదారులుగా చూడడం నుండి పుట్టింది. మనిషి సంపదను సృష్టించగలడు. ఎక్కువ మంది మనుషులు ఉండడం భూమికి లాభదాయకమే. అందుకే పవిత్ర ఖుర్‌ఆన్ ప్రజలను సంతానోత్పత్తి పట్ల భయపడ వద్దని ఉపదేశించింది. ఎక్కువమంది సంతానాన్ని కనే మహిళను పెళ్ళాడండని ప్రవక్త చెప్పిన మాటల్లో అంతరార్థ మిదే. పేదరికం అనే భ్రమాత్మక భయాలతో జనాభా నియంత్రణ కోసం వాదించేవారు సృష్టికర్త దివ్యఖుర్‌ఆన్‌లో చెప్పిన మాటలను అవలోకనం చేసుకోవాలి. "జనాభా నియంత్రణ ప్రకృతి సిద్ధంగా జరుగుతుంది.' "దారిద్ర్య ప్రమాదం చూపి షైతాను మిమ్మల్ని భయ పెడతాడు. నీతిబాహ్యమైన, నీచమైన మార్గం అవలంబించండి అని ప్రేరేపిస్తాడు. కాని మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని అల్లాహ్ వాగ్దానం చేస్తున్నాడు. అల్లాహ్ అత్యంత ఉదార స్వభావుడు, అన్నీ తెలిసినవాడు." (2:268)

✤ ✤ ✤

అధ్యాయం -19

52

## 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎమ్. మలిక్

### కుర్ఆన్ అవగాహన

ఒకసారి ప్రవక్త మస్జిద్‌లో ఓ సహచర మాన్యులు, మహనీయ అలీ సమక్షంలో, "నాకు విశ్వాసం తరువాత కేవలం దైవ గృహ నిర్మాణ కార్యంలో పాల్గొనే భాగ్యం లభిస్తే చాలని నేను అనుకుంటున్నాను" అని అన్నారు. అప్పుడు మహనీయ అలీ కల్పించుకుని, "కాదు బాబు, దైవమార్గంలో సతత సమరం జరపడం దైవ గృహ నిర్మాణం కన్నా మహత్తరమయినది" అన్నారు. ఈ లోగా మహనీయ ఉమర్(ర) కూడా అక్కడికి చేరుకున్నారు. ఆయన జోక్యం చేసుకుని, "ఇది దైవ ప్రవక్త ప్రసంగించే మింబర్. ఇక్కడ మర్యాద పాటించడం అవసరం. తగ్గు స్వరంలో మాటలాడాలి. ఇంతకు మీరు చర్చిస్తున్న విషయాన్ని నమాజ్ తరువాత ప్రవక్తశ్రీ ని అడిగి తెలుసుకోండి" అన్నారు.

అలాగే నమాజ్ తరువాత మహనీయ అలీ ప్రవక్తను అడిగారు. ఆయన(స) దివ్య కుర్ఆన్‌ని ఉటంకించారు,

"హాజీలకు నీరు త్రాపించడం, పవిత్ర మస్జిద్‌కు సేవలు చేయడాన్ని, దైవాన్నీ కడపటి దినాన్నీ విశ్వసించి, దైవ మార్గంలో సతత సమరం సలిపిన వ్యక్తి కృషికి సమానమని భావిస్తున్నారా? దైవం దృష్టిలోనయితే వీరిరువురు సమానులు కాజాలరు. అల్లాహ్ దౌర్జన్యపరులకు దారి చూపడు. దైవం దృష్టిలో విశ్వసించిన వారు, ఆయన మార్గంలో ఇల్లూవాకిలి వదలి ధన ప్రాణాలతో సతత సమరం జరిపిన వారే సాఫల్యం పొందుతారు. వారి ప్రభువు వారికి తన కారుణ్యం, ప్రసన్నతలు ఇంకా వారి కొరకు నిర్విఘ్న వరప్రసాదాలు, అనంత సుఖాల స్వర్గాల శుభవార్త అందజేస్తున్నాడు. వారు అక్కడే సర్వదా ఉంటారు. నిస్సందేహంగా దైవం వద్ద సేవలకు ప్రతిఫలం ఇవ్వడానికి పుష్కలంగా ఉంది."

(అత్ తౌబా 9 : 19- 22)

దివ్య కుర్ఆన్‌లోని ఈ ఆయత్‌లు మహనీయ అలీ (ర) అభిప్రాయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. అల్లాహ్ ఈ ఆయత్‌లలో, పవిత్ర మస్జిద్ నిర్మాణం హజ్జ్ ఉమ్రాలు, హాజీల పట్ల సద్వర్తన-వీటన్నింటికన్నా దైవాన్ని విశ్వసించడం, ఆయన మార్గంలో కృషి జరపడం మహత్తర మయినవని ఉద్ఘాటిస్తున్నాడు. మహనీయ అలీ(ర)లో దివ్య కుర్ఆన్‌ని అవగత పరచుకునే ఆసక్తి, పటిమ మెండుగా ఉండేవని చాటే హదీసులు అనేకమున్నాయి. వీటిని బట్టి ఆయన ధర్మ నైజాన్ని తనలో జీర్ణించు కుని తన నైజాన్ని దాని కనుగుణంగా మలచుకున్నారని కూడా ద్యోతకమవుతుంది.

### హదీసుల ఉల్లేఖనం

మహనీయ అలీ(ర) తన కాలంలో సహచర మాన్యులు అందరి కన్నా ప్రవక్త సంప్రదాయం (సున్నత్) జ్ఞానం కలవారని ప్రతీతి. ఒక సారి మహనీయ ఆయిషా(ర) సమక్షంలో మహనీయ అలీ ప్రస్తావన రాగా ఆమె, "నేడున్న సహచర మాన్యులలో అలీ, ప్రవక్త సంప్రదాయం గురించి అందరి కన్నా అధికంగా తెలిసిన వారు" అన్నారు. ప్రవక్తశ్రీ(స) పలికిన అయిదు వందల ఎనభై ఆరు(586) హదీసులు ఉటంకించారు ఆయన.

## మహనీయ అలీ(ర) మహత్తు, ఔన్నత్యం

మహనీయ అలీ(ర)ది సర్వతోముఖ వ్యక్తిత్వం. ఆయన రణ రంగంలో గొప్ప అశ్వారూఢుడు, ధైర్య సాహసాల వీరుడు, ఖైబర్ విజేత, దివ్య కుర్‌ఆన్ ప్రేమికుడు, ఇస్లామ్ స్వీకృతిలో ప్రప్రథముడు, ఇంకా ప్రవక్త(స) అల్లుడు! సహచర మాన్యులలో ఉన్నత స్థానం గలవారు. హదీసుల్లో ఆయన స్థాయి ఏమిటో చూడండి:

మహనీయ అలీ(ర) ఇలా అన్నారు, విత్తును చీల్చించి(చెట్టును పుట్టించిన), మానవ ఆత్మను సృజించిన స్వామి మీద ఒట్టు, నిరక్షరాసి అయిన ప్రవక్త(స) నాతో నుడివారు, "నన్ను విశ్వాసి మాత్రమే ప్రేమిస్తాడు, కపటి మాత్రమే నా పట్ల వైరం కలిగి ఉంటాడు."

ఒక సందర్భంలో మస్జిద్‌లో మహనీయ సయీద్ బిన్ జైద్(ర) నిల్చోని, "నేను సాక్ష్యం పలుకుతున్నాను, ప్రవక్త(స) చెప్పగా విన్నాను, స్వర్గంలో ప్రవక్త(స)తోపాటు పది మంది ఉంటారు. వారు, మహనీయులు 'అబూ బక్ర్, ఉమర్, ఉస్మాన్, అలీ, తల్హా, జుబైర్, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, అబూ ఉబైదా, సఅద్ బిన్ అబీ వక్కాస్,'' అని చెప్పి, 'నేను కోరుకుంటే పదవ వ్యక్తి పేరు కూడా చెప్పగలను అన్నారు. జనం అడిగారు, ఎవరు వారు అని. అయినా ఆయన మౌనమే వహించారు. జనం మళ్ళీమళ్ళీ అడగ్గా, ఆయన తల వాల్చి, 'సయీద్ బిన్ జైద్' అన్నారు.

మహనీయ ఉమ్మె సలమా, "నేను ప్రవక్త(స) ఇలా చెప్పగా విన్నాను, 'ఎవరయితే అలీని దూషిస్తారో వారు నన్ను దూషించినట్లు.''

ఒక వ్యక్తి అబ్దుల్లా బిన్ ఉమర్(ర) వద్దకు వచ్చి మహనీయ ఉస్మాన్(ర)ని గురించి అడిగాడు. ఆయన మహనీయ ఉస్మాన్ చేసిన సత్కార్యాలను ప్రస్తావించి పొగిడారు. అతనితో, 'బహుశా నీకు ఈ మాటలు రుచించ లేదేమో' అన్నారు. అతను 'అవును ఈ మాట రుచించలేదు' అన్నాడు. ఆయన, "దైవం నీ ముక్కు మట్టి పాలుజేయుగాక"అన్నారు. అతను తిరిగి మహనీయ అలీని గురించి అడిగాడు. దానికి ఆయన, "ఆయనయితే ప్రవక్త ఇంటి భాగమే కదా" అన్నారు. ఇంకా "బహుశా ఈ మాటా రుచించ లేదేమో నీకు" అన్నారు. అతను 'అవును' అన్నాడు. అప్పుడు ఆయన, "నీ ముక్కు పాడుగాను, వెళ్ళు ఇక్కడి నుంచి, నాకు వ్యతిరేకంగా నీకు చేతనయింది చేసుకో" అన్నారు.

## వహీ లిఖించిన వారిలో ఒకరు

మహనీయ అలీ(ర) చిన్నప్పటి నుంచి చదవను వ్రాయను ఎరిగిన వారు. వహీని గ్రంథస్థం చేసేవారిలో ఆయన కూడా ఒకరు. అక్షరాస్యత వల్ల ధార్మిక జ్ఞానం సంపాదించడం ఆయనకు సులువుగా సుసాధ్యమయింది. దివ్య కుర్‌ఆన్ నకళ్ళను వ్రాసేవారికి ఏ విధంగా వ్రాయాలో సూచనలు ఇచ్చేవారు.

జ్ఞాన సముపార్జనలో ఏ విధంగా జిజ్ఞాస గలవారో అదేవిధంగా పొందిన జ్ఞానాన్ని అమలు పరచడంలో కూడా ఆయన పట్టుదల గలవారే. ఆయన(ర) ఒకసారి అన్నారు, "జ్ఞానం ఆచరణకు పిలుపునిస్తుంది. ఆచరణ ఆ పిలుపును స్వీకరిస్తే సరి, లేకపోతే జ్ఞానం అక్కడి నుంచి వెళ్ళిపోతుంది."

## మహనీయ అలీ(ర) దృష్టిలో

మహనీయ అలీ(ర)ని ఎవరో ఈమాన్ గురించి అడిగారు, ఆయన దానికి సమాధానంగా ఇలా చెప్పారు:
ఈమాన్ (విశ్వాసం) నాలుగు స్థంభాల పైన స్థిర పడుతుంది. 1. సహనం, 2. నమ్మకం, 3. న్యాయం, 4. సతత సమరం.

### సహనం నాలుగు భాగాలు

అభిలాష, భీతి, త్యాగం, మృత్యు నిరీక్షణ.
స్వర్గాభిలాష గలవారు కాంక్షలను వదలుకుంటారు. నరకం పట్ల భీతి గలవారు నిషిద్ధ చర్యలకు దూరంగా మసలుకుంటారు. ప్రపంచాన్ని త్యజించిన వారు కష్టాలకు ప్రాముఖ్యత నివ్వరు. మృత్యువు కొరకు నిరీక్షించే వారు సత్కార్యాల వైపునకు శీఘ్రంగా సాగుతారు.

### నమ్మకం కూడా నాలుగు భాగాలు :

జాగరూకతతో దూరదృష్టి కలిగి ఉండటం, వివేచనను సదా సిద్ధంగా ఉంచడం, గుణపాఠం గ్రహించడం, పూర్వ జనుల సంప్రదాయాన్ని పాటించడం.
జాగరూకతతో పని చేసే వ్యక్తికి వివేచన తానయి ముందుకు వస్తుంది. వివేచన కలగగానే గుణపాఠాన్ని తప్పక గ్రహిస్తాడు. అంతే అతను పూర్వులతో సమానమయిపోతాడు.

### న్యాయం నాలుగు భాగాలు :


లోతయిన అవగాహన, విస్తృత జ్ఞానం, నిర్ణయ శక్తి, సహనం సంయమనం.

సరయిన అవగాహన ద్వారా పని చేసే వ్యక్తి జ్ఞానాన్ని విస్తృత పరచుకోగలడు, విస్తృత జ్ఞానం సాధించిన వ్యక్తి నియమ నిబంధనలు తెలుసుకుంటాడు. అలాగే సహనం సంయమనంతో పని చేసే వ్యక్తి జీవన వ్యవహారాల్లో అతి వాదానికి దారి నివ్వడు, జనుల మధ్య ప్రశంసనీయంగా మనగలుగుతాడు.

### సతత సమరం కూడా నాలుగు భాగాలు :

అమ్ర్ బిల్ మారూఫ్ (మంచిని ఆదేశించడం), నహీ అనిల్ మున్కర్ (చెడును వారించడం), సర్వదా సత్యం, పాపాతురులతో వైరం.

మంచిని ఆదేశించిన వ్యక్తి విశ్వాసులకు శక్తిని చేకూర్చుతాడు. మరి జనుల్ని చెడుల నుంచి వారించిన వ్యక్తి కపటులను మట్టి కరిపిస్తాడు. సత్యాన్ని వదలని వ్యక్తి తన బాధ్యతను నెరవేర్చినట్లు, మరి పాపాతురులతో వైరం కలిగి దైవం కొరకు వారి పట్ల అయిష్టత కలిగి ఉన్న వ్యక్తిని ప్రళయం నాడు దైవం ప్రసన్నం చేసుకుంటాడు. ✤



### కుల్లు నఫ్సిన్ జాయిఖతుల్ మౌత్ ..
### ప్రతి ప్రాణీ మరణంరుచి చవి చూడవలసి ఉంటుంది.

# మరణానంతర జీవితం

మదీహా అర్జుమంద్

**మనం నివసించే ఈ ప్రపంచాన్ని,** అందులో వివిధ రకాల ప్రాణుల్ని దైవం సృష్టించాడు. ప్రాణుల్లో కొందరి స్థాయి ఎక్కువ మరికొందరి స్థాయి తక్కువ. ఒక ప్రాణి అత్యున్నత శ్రేణి సృష్టిరాశి అయితే, మరో ప్రాణి అధమస్థాయి ప్రాణి. అన్ని ప్రాణుల్లో అన్ని జీవరాసుల్లో మానవుడు అత్యున్నతమైన శ్రేణికి చెందిన, గౌరవప్రదమైన ప్రాణి. అందుకని అతనిపై చాలా బాధ్యత లున్నాయి. స్థాయి పరంగా, హెూదా పరంగా మానవుడు అత్యున్నత స్థాయిలో ఉన్నాడు కాబట్టి దైవంముందు జవాబుదారీతనం కూడా ఎక్కువే! మనిషి బాధ్యతారహితమైన జీవితం గడపలేడు. అనుక్షణం అతను జవాబుదారీతనంతో గడపవలసి ఉంటుంది. చేసిన ప్రతి పనికీ, పలికే ప్రతి మాటకు సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. తన వనరులను, శక్తి సామర్థ్యాలను ఎక్కడెక్కడ వినియోగించాడో లెక్క చెప్పవలసి ఉంటుంది. ఏది సత్యం, ఏది అసత్యం, ఏది న్యాయం ఏది అన్యాయం, ఏది మంచీ, ఏది చెడు అనే విచక్షణతో జీవితం గడపవలసి ఉంటుంది. మరణానంతరం వీటన్నిటి గురించి దేవుని సన్నిధిలో సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. మనిషి చనిపోయిన తరువాత ఇక ఏమీ ఉండదు, మంచిచేసినా చెడు చేసినా అడిగే వాడు ఎవడూ ఉండడు, ప్రాపంచిక జీవితమే అసలు జీవితం.. మరణం తరువాత మరో జీవితం అనేది ఏదీలేదు అనే భ్రమల్లో ఉండకూడదు. ఎవరైనా ఇలా భావిస్తే అది పూర్తిగా తప్పు. ఇలా ఆలోచించే మనిషి తనను తాను మోసం చేసుకుంటున్నట్లు

లెక్క. కళ్ళకు కప్పుకున్న అడ్డుపొర తొలగి మరణానంతర జీవితం ముందుకొచ్చినప్పుడు, తాను తిరస్కరిస్తూ వచ్చిన, తాను ఎగతాళి చేసిన అదే జీవితం వాస్తవమై నిలిచినప్పుడు తన ఇహలోక జీవిత ఆచరణల లెక్కలు చెప్పడానికి అతను అనివార్యంగా సిద్ధం కావలసి ఉంటుంది.

ప్రతి మనిషీ మరణిస్తాడు. మీరంతా మీ పూర్తి ప్రతిఫలాన్ని ప్రళయం నాడు పొందుతారు. అక్కడ నరకాగ్ని నుండి కాపాడబడి, స్వర్గంలో ప్రవేశపెట్టబడే వాడు మాత్రమే యథార్థానికి సఫలీకృతుడు. ఇక ఈ ప్రపంచం, అది కేవలం మాయావస్తువు మాత్రమే. *(ఆలి ఇమ్రాన్ 184)*

ఇలా ఉంది : మేము చనిపోయి, మట్టిగా మారి, అస్థిపంజరంగా మిగిలిపోయినపుడు, మళ్ళీ మమ్మల్ని బ్రతికించి లేపటం జరిగేపనేనా? పూర్వకాలం నాటి మా తాత, ముత్తాతలు సైతం లేపబడతారా?" వారితో, "అవును (లేపబడతారు) మీరు (దేవుని ముందు) నిస్సహాయులు" అని అను. అది కేవలం ఒక పెద్ద గద్దింపు మాత్రమే. హఠాత్తుగా వారు (తమకు తెలుపబడుతూ ఉన్న విషయాలనన్నింటినీ) కళ్ళారా చూస్తూ ఉంటారు. అప్పుడు వారు "మేమెంత దౌర్భా గ్యులం, ఇది తీర్పుదినం కదా! అని అంటారు. *(సూరె సాఫ్ఫాత్ 16-20)*

అలాగే బఖరా సూరాలో ఒక సంఘటన ప్రస్తావించబడింది. 'ఒకవ్యక్తి ఉదంతం గురించి ఆలోచించావా? అతను ఒక గ్రామం మీదుగా ప్రయాణం చేయసాగాడు. ఆ గ్రామం ఇండ్ల కప్పులు కూలిపోయి సర్వనాశనమయి ఉంది. అతను సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ, చచ్చిపోయిన ఈ ఊరి జనాన్ని దేవుడు మళ్ళీ ఎలా బ్రతికిస్తాడో.. అనుకున్నాడు. అప్పుడు వెంటనే దేవుడు అతని ప్రాణం తీశాడు. ఆవిధంగా అతడు (నిర్జీవ స్థితిలో) వందేళ్ళపాటు పడిఉన్నాడు. తరువాత దేవుడు అతనికి మళ్ళీ ప్రాణంపోసి లేపాడు. అప్పుడతనితో, 'నీవీ స్థితిలో ఎంతకాలం ఉన్నావో చెప్పగలవా?' అని అడిగాడు. దానికావ్యక్తి, 'ఒకరోజో లేక అంతకంటే తక్కువ కాలమో ఉన్నాననుకుంటు న్నాను.' అన్నాడు.

అప్పుడు దేవుడు ఇలాచెప్పాడు. 'కాదు, నువ్వు వందేళ్ళు ఇలా ఉన్నావు. సరే, నువ్వు వెంట తెచ్చుకున్న అన్న పానీయాలవైపు చూడు, ఇన్నేళ్ళు గడిచినా అవి ఏమాత్రం చెడిపోలేదు. నీ గాడిద వైపు కూడా ఒకసారి చూడు (దాని ఎముకలు ఎలా జీర్ణమై పోయాయో). మేము నీ ఉదంతం ద్వారా ప్రజలకు గుణపాఠం గరపడానికే ఇలా చేశాము. ఈ ఎముకలగూడు సరిచేసి దానిపై తిరిగి మాంసం సృష్టించి ఎలా లేపుతామో చూడు.' అన్నాడు దైవం.

మరొక సంఘటనను కూడ దృష్టిలో ఉంచుకో. ఇబ్రాహీము ఇలా అడిగాడు: "ఓ నా ప్రభూ! నీవు మృతులను ఏ విధంగా బ్రతికిస్తావో నాకు చూపించు." అల్లాహ్ "నీకు విశ్వాసం లేదా?" అని అడిగాడు. ఇబ్రాహీము వినయంగా ఇలా అన్నాడు: "నాకు విశ్వాసం అయితే ఉంది. కాని మనస్సును తృప్తిపరచటం కోసం అడుగుతున్నాను." అప్పుడు అల్లాహ్ చెప్పాడు: "సరే, మంచిది, నాలుగు పక్షులను తీసుకో. వాటిని బాగా మచ్చిక చేసుకో; తరువాత ఒక్కొక్కదాని భాగాన్ని ఒక్కొక్క కొండపై పెట్టి రా. మళ్ళీ వాటిని రమ్మని పిలువు. అవి నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాయి. అల్లాహ్ సర్వశక్తిమంతుడూ సర్వజ్ఞుడూ అని బాగా జ్ఞాపకం ఉంచుకో." (2 : 260)

అసలు మానవులను మరణానంతరం మళ్ళీ బ్రతికించి లేపడం ఎందుకు? వారి కర్మలకు శిక్షలూ, బహుమానాలు ఎందుకు? ఇది ఆలోచించాల్సిన విషయం. ఈ ప్రపంచంలో రకరకాల వ్యక్తులు మనుగడ సాగిస్తున్నారు. ఇందులో మంచివాళ్ళూ ఉన్నారు, చెడ్డవాళ్ళూ ఉన్నారు. పీడించేవాళ్ళూ ఉన్నారు, పీడనకు గురైనటువంటి వాళ్ళూ ఉన్నారు. దైవానికి భయపడి విలువలతో కూడిన జీవితం గడిపేవారూ ఉన్నారు. దైవాన్ని తిరస్కరించి ఇష్టానుసారంగా, విచ్చలవిడి జీవితం గడిపేవారూ ఉన్నారు. పేదసాదలను ఆదుకునే వారూ ఉన్నారు. పేదల రక్తం రుచి మరిగినవారూ ఉన్నారు. నీతికీ న్యాయానికీ కట్టుబడి నిబద్ధతతో బ్రతికేవాళ్ళూ ఉన్నారు. ఇతరుల్ని ఏడిపించుకుతిని, వారిపై దౌర్జన్యాలకు పాల్పడేవారూ ఉన్నారు. దైవ విశ్వాసులు, దైవ తిరస్కారులు అందరూ ఉన్నారు. మరి వీరందరికీ ఒకే రకమైన ప్రతిఫలం లభించడం భావ్యమేనా? ఇది సమంజసమా? దుర్మార్గులకు, దౌర్జన్యపరులకు తగిన శాస్తి జరగాలి కదా! బలహీనులకు, పీడితులకు న్యాయం జరగాలి కదా! మంచీ చెడు, నీతీ న్యాయం, ధర్మాధర్మాల విచక్షణ పాటిస్తూ నైతికంగా జీవితం గడిపిన వారికి తగిన సత్ఫలితం, పుణ్యఫలం దక్కాలి

గదా! మానవత్వాన్ని మంటగలిపి, కులమతాలమధ్య చిచ్చుపెట్టి, విద్వేష బీజాలు నాటి, మానవ సమాజాన్ని కలుషితం చేసినవాడు తగిన శిక్ష అనువించాలి గదా! అవును.. ఇదే న్యాయం.. ఇదే ధర్మం.. తప్పకుండా దుర్మార్గులకు తగిన శిక్ష, మంచివారికి తగిన బహుమానం, సత్కారాలు లభించవలసిందే. ఇదే విషయం సూరె ఖలంలో అల్లాహ్ చెబుతున్నాడు. 'మేము విధేయులు, తిరస్కారులు ఇరువురి పట్ల ఒకే విధంగా ప్రవర్తిస్తామని అను కుంటున్నారా? అదెలా సాధ్యం?' అంటున్నాడు.

ఈ ప్రపంచంలో కొందరు దైవాన్ని తిరస్కరించి, ఆయన ఆదేశా లను తుంగలో తొక్కుతున్నారు. పరులపై దౌర్జన్యం చేస్తున్నారు. పేదసాదల రక్తం తాగుతున్నారు. సమాజంలో విద్వేష బీజాలు నాటుతున్నారు. కులాలమధ్య మతాలమధ్య గొడవలు సృష్టించి తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారు. విభజన, విచ్ఛిన్నపు ఆలోచనలు తప్ప నిర్మాణాత్మకమైన ఆలోచనలే వారి బుర్రలోకి రావు. అయినా అలాంటి వారు హాయిగా ఉన్నారు. సర్వ భోగాలూ అనుభవిస్తున్నారు. వారిని అడిగేవాడు, ప్రశ్నించేవాడు, శిక్షించేవాడు ఎవ్వడూలేడు.

దీనికి భిన్నంగా, మరికొందరు దైవాన్ని నమ్మేవారు, మాన వత్వంతో జీవిస్తారు. ఇతరులకు ఏవిధమైన హానీ తలపెట్టరు. నీతి నిజాయితీగా ధర్మంగా జీవితంగడుపుతారు. ఇతరుల మనసు నొప్పించరు. అందరితో సామరస్యంగా సోదరభావంతో మసలుకుంటారు. కష్టకాలంలో ఇతరులను ఆదుకుంటారు. అయినా సరే ఇలాంటి వారిని ఎవరూ పట్టించుకోరు. వారి సత్కర్మలకు ఈ ప్రపంచంలో తగిన ప్రతిఫలం లభించదు. వారి మంచితనం వారిని మరిన్ని కష్టాలకు గురిచేస్తుంది. వారి జీవితం దుర్లభమైపోతుంది.

మనంగనక ఒక్కసారి నిష్పాక్షికంగా ఆలోచిస్తే, దుర్మార్గుడు, దౌర్జన్యపరుడికి ఏవిధంగా కఠినమైన శిక్ష విధించాల్నో, అలాగే మంచివాడికి, నిజాయితీ పరుడికి తగిన సత్కారం, బహుమానం లభించాలి. అని మనకు అర్ధమవుతుంది. అది ఈ ప్రపంచంలో సాధ్యంకాదు. అందుకు మరణానంతర జీవితం అనివార్యం. మంచేదో చెడేదో, అసలైనదేదో కల్తీదేదో నిజాలనిగ్గు తేల్చే గీటురాయి మరణానంతర జీవితం. మంచిని మంచిగా చెడును చెడుగా ప్రకటించేది మరణానంతర జీవితం. మంచికి సత్కారం, బహుమానం, చెడుకు, దుర్మార్గాలకు కఠినశిక్ష లభించేది ఆ జీవితంలోనే... ఇక్కడ ఎవరికైనా, అంటే మంచివాడికైనా, చెడ్డవాడికైనా వారి కర్మలకు తగిన సమాన ప్రతిఫలం లభించే వ్యవస్థే ఇక్కడ లేదు.

కాబట్టి దైవ ప్రసాదితమైన ఈ ప్రాపంచిక జీవితాన్ని ఆయన, ఆయన ప్రవక్త చూపిన మార్గంలో గడపాలి. మానవాళి సాఫల్యం కోసం దైవం పంపిన ధర్మాన్ని మానవులందరి వరకూ చేర వేయాలి. దైవ ధర్మ సంస్థాపనకు శక్తివంచన లేకుండా మన స్థాయిలో మనం ప్రయత్నించాలి. అప్పుడే ఇహలోక జీవితం జయప్రదమవుతుంది. మరణానంతర పరలోక జీవితమూ సఫలమవుతుంది. ఏమంటారు? ✤


**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

అన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# 'చరితార్థులు'-2



# మౌలానా ముహమ్మద్ మియాఁ మన్‌సూర్ అన్సారి

## (1884-1946)

62





**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** **THE IMMORTALS- 2 (ఇంగ్లీషు)** నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**భారత స్వాతంత్ర్యోద్యమంలో** భాగంగా ఆంగ్ల వలసపాలకులను తీవ్ర భయాందోళనకు గురి చేసిన 'సిల్క్ రుమాలు కుట్ర' సంఘటనలో ప్రముఖ పాత్ర వహించిన మౌలానా ముహమ్మద్ మియాఁ మన్‌సూర్ అన్సారి 1884 మార్చి 10న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, సహరాన్‌పూర్ సమీపాన గల అన్‌బేతాలో జన్మించారు. తండ్రి మౌలానా అబ్దుల్లా అన్సారి పర్యవేక్షణలో ప్రాథమిక విద్య అభ్యసించి,1903లో దారుల్ ఉలూం దేవ్‌బంద్ నుండి డిగ్రీ చేశారు. ఆ తరువాత ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు, తన గురువు మౌలానా ముహమూదుల్ హసన్ మార్గదర్శకత్వంలో, మౌలానా ఒబేదుల్లా సింధి నేతృత్వంలో ఏర్పడిన 'జమీయత్ ఉల్ అన్సార్'లో బాధ్యతలు నిర్వహించారు. ప్రథమ ప్రపంచ యుద్ధం సమయంలో మాతృభూమి విముక్తి కోసం భారత వాయవ్య సరిహద్దు ప్రాంతాల నుండి యుద్ధం ఆరంభించాలని మౌలానా హసన్ రూపొందించిన ప్రణాళికలో భాగంగా 1915లో ఆయనతో కలసి మన్‌సూర్ అన్సారి అరేబియాకు పయనమయ్యారు. అక్కడ టర్కీ గవర్నర్ గాలిబ్ పాషా నుండి తమ ప్రణాళికకు మద్దతు కూడ గట్టిన మౌలానా హసన్ యుద్ధ సహాయం హామీని 'గాలిబ్‌నామా' రూపంలో పొందారు. ఆ లేఖా సారాంశాన్ని సరిహద్దులలో గల విప్లవదళాలకు, బ్రిటిష్ భారత సైనిక దళాలలోని భారతీయులకు వెల్లడించి యుద్ధం కోసం ప్రజలను సిద్ధం చేయడానికి 'గాలిబ్‌నామా'ను ప్రాచుర్యంలోకి తెచ్చే బాధ్యతను మౌలానా అన్సారికి మౌలానా హసన్ అప్పగించారు. ఆ సమయంలో కాబూల్ కేంద్రంగా ప్రొఫెసర్ బర్కతుల్లా భోపాలీ ప్రధానమంత్రిగా ఏర్పడిన ప్రవాస భారత ప్రభుత్వ సైనిక వ్యవస్థ ఏర్పాటులో మౌలానా అన్సారి ప్రత్యేక భూమిక నిర్వహించారు. మౌలానా హసన్ అప్పగించిన ప్రచార బాధ్యతలను వాయవ్య సరిహద్దు ప్రాంతంలో చేపట్టి, యుద్ధం ఏర్పాట్లు చేస్తూ, 'జనూద్-ఎ-రబ్బానియా' వంటి ప్రత్యేక సంస్థల ఏర్పాటులో మౌలానా ఒబేదుల్లా సింధీకి తోడ్పడ్డారు. ఈ మేరకు ప్రవాస భారత ప్రభుత్వం, జునూద్-ఏ-రబ్బానియా సైనిక దళాల విశేషాలను వివరిస్తూ మౌలానా హసన్‌కు పంపడానికి రూపొందించిన లేఖ తయారీలో మౌలానా అన్సారి భాగస్వాములయ్యారు. మదీనాలోని మౌలానా హసన్‌కు పంపాల్సిన ఈ లేఖతోపాటు మౌలానా సింధీ తన సూచనలను సిల్కు చేతి రుమాలు మీద రాసి జోడించడంతో ఈ వ్యవహారాన్ని 'సిల్కు రుమాలు కుట్ర'గా బ్రిటిష్ ప్రభుత్వం నామకరణం చేసింది. 1916 జులై 9/10 తేదిల్లో రూపొందించిన ఆ లేఖ మౌలానా హసన్‌కు చేరాల్సి ఉండగా ముల్తాన్ వద్ద 1916 అగస్టు 15న అది బ్రిటిష్ గూఢచారుల చేతిలో పడింది. ఆ లేఖాంశాలను తెలుసుకున్న ప్రభుత్వం అప్రమత్తమై మౌలానా హసన్ లాంటి పలువుర్ని నిర్బంధించింది. ఆ సమయంలో అరెస్టు కాకుండా అతి చాకచక్యంగా తప్పించుకున్న ముహమ్మద్ మియాఁ మన్‌సూర్ అన్సారి 30 ఏండ్లపాటు మాతృభూమికి దూరంగా గడుపుతూ చివరకు ఆఫ్ఘనిస్తాన్ లోని జలాలబాద్‌లో 1946 జనవరి 11న కన్నుమూశారు. ✤

కథ

షహనాజ్‌బేగం, అనంతపురం



# జీవిత పరమార్థం

**‘ఏమిటి నయీమ్,** ఇంకా ఎన్నాళ్ళు ఇలా పెళ్ళి పెటాకులు లేకుండా ఉంటావు. నీ తోటి వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయిపోయి పిల్లలు కలిగి వాళ్ళు పెరిగి పెద్దవారయిపోయి కాలేజీలకు వెళ్తున్నారు. మరికొందరు బిడ్డల పెళ్ళిళ్ళు చేసేస్తున్నారు. నువ్వు మాత్రం నలభై ఏళ్ళు దాటుతున్నా ఇంకా పెళ్ళి గురించి ఏమీ ఆలోచించటంలేదు...'' అన్నాడు ముస్తనీర్. అతను నయీమ్ స్నేహితుడు.

ఆ రోజు స్నేహితులందరూ ఒకచోట కలుసుకున్నారు. అలా సెలవు రోజుల్లో ఒకచోట అందరు కలుసుకుని పిచ్చాపాటి మాట్లాడుకోవడం ఆనవాయితీ.

అక్కడ ఉన్న మిగతా వాళ్ళందరూ వివాహితులే. పిల్లాజెల్లా గల వాళ్ళు. నయీమ్ తప్ప. ఎప్పుడూ పెళ్ళి పట్ల విముఖతను చూపు తుంటాడు. అతని తల్లిదండ్రులు బ్రతికి ఉన్నన్నాళ్ళు కొడుకును పెళ్ళి చేసుకోమని ఎన్నో విధాలుగా నచ్చజెప్పారు. ఎన్నో సంబంధాలను చూపించారు. కానీ అతను మాత్రం అన్నింటిని కాలదన్నాడు. కానీ అతను మాత్రం పెళ్ళి అనే ‘ఝుంఝూటం’లో పడకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాడు.

కొడుకు పెళ్ళి చూడకుండానే అతని కన్నవాళ్ళు కాలధర్మం చెందారు. ఇక అతని గురించి పట్టించుకునేవారే లేకపోయారు. అతనిని ఎవరూ అడిగేవారు లేకపోవడంతో మరింత స్వేచ్ఛగా జీవించసాగాడు.

మిత్రుడు ముస్తనీర్ చెప్పిన దానికి సమాధానంగా అతను నిర్లక్ష్యంగా వాళ్ళ వంక చూస్తూ ఇలా అన్నాడు : “అబ్బో మీరందరూ పెళ్ళిళ్ళు చేసుకుని మహా సుఖపడిపోతున్నట్లు. మీ సంసార అగచాట్లు నాకు తెలియవు అనుకుంటున్నారా. మీలో కొందరు భార్యల వేధింపులతోను, పిల్లల సమస్యలు, వారి ఖర్చులతోను ఇంకా మీలో విడాకులు తీసుకుని రెండో వివాహం చేసుకుని నానా తిప్పలు పడుతున్నారు. నేను ఆ బాధలన్నీ పడలేను. నాకు ఈ జీవితమే బాగుంది. అయినా మీ పిచ్చిగానీ, పాలు కావాలంటే ఎవరయినా ఆవును తెచ్చుకుని ఇంట్లో కట్టేసుకుంటారా? దానికి మేత వెయ్యాలి, దానికి మళ్ళీ ఏ దూడనో పుడితే దానికి అదనంగా మరో ఖర్చుల బాధ. అబ్బ నేను ఆ సమస్యలన్నీ భరించలేను బాబు'' అంటూ చేతులెత్తేశాడు నయీమ్.

అతని మాటలు విని నివ్వెరపోయారు అతని మిత్ర బృందం. మళ్ళీ అతనే చెప్పటం ప్రారంభించాడు.

“అంతేకాదు నాకు ఈ కుటుంబ వ్యవస్థ మీద నమ్మకం పోయింది. భార్యాభర్తల నడుమ బాంధవ్యాలు కొనసాగటం లేదు. వివాహ వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోతోంది. భార్యాభర్తల మధ్య ఆధిపత్య పోరు జరుగుతోంది. వారికి కలిగిన పిల్లలు పెద్దల ఘర్షణ వల్ల అనాథలయిపోతున్నారు. కుటుంబ ఘర్షణల వల్ల మనిషి నిర్వీర్యమైపోతున్నాడు. ఇదంతా చూసినా మనసు విరక్తి చెంది పెళ్ళంటేనే వ్యాకులత చెందుతోంది అన్నాడు సీరియస్‌గా.

అదంతా విని నిట్టూర్చారు ఆ స్నేహితులు. “అలా ఎవరికో ఏదో జరిగిందని పెళ్ళిని మానుకుంటావా? జీవితమంటే సమస్యల వలయం. ఆటుపోట్లు ఉంటాయి. కష్టనష్టాలు ఉంటాయి. బాధలు, ఆవేదనలు ఉంటాయి. వాటిని ఎదుర్కొనే శక్తి మనకు ఉండాలి. అన్నింటికంటే ముఖ్యం జీవితంలో మనవాళ్ళు అనే వారుండాలి. ఒక తోడు ఉండాలి. రక్త సంబంధీకులు ఉండాలి. మనలో శక్తి ఉడిగిపోయినప్పుడు మన అనుకునేవారుండాలి”.

ఇలా ఎన్నో విధాలుగా నచ్చజెప్పబోయినా అతనికేమాత్రం చెవికెక్కలేదు. నిర్లక్ష్యంగా నవ్వి ఊరుకుండిపోయాడు.

నయీమ్ లాంటి వాళ్ళు ఈ సమాజంలో చాలామంది తయారవుతున్నారు. అందులో అమ్మాయిలు కూడా ఉన్నారు. స్వేచ్ఛగా ఏ బాదరాబంది లేకుండా బ్రతకాలనుకుంటున్నారు.

ఆ స్నేహితులు కాలమే నీలో మార్పు తెస్తుందని చెప్పి వెళ్ళిపోయారు.

★★★

అలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకసారి అతనికి అస్వస్థతగా వుంటే హాస్పిటల్‌లో జాయిన్ అయ్యాడు. డాక్టర్లు అతనికి రకరకాల టెస్టులు చేస్తున్నారు. అతని పక్కన మరో పేషంటు ఉన్నాడు. అది షేరింగ్ రూమ్ కావటంతో అతను కాక మరో పేషంట్ ఉన్నాడు. అతనిని చూసుకోవడానికి అతని కొడుకు రాత్రింబవళ్ళు అక్కడే ఉంటున్నాడు. అతని భార్య కూడా వచ్చి సపర్యలు చేస్తున్నది. ఒక్కోసారి మొత్తం కుటుంబం అంతా వచ్చి అతనిని ప్రేమగా పలకరించి వెళ్తున్నారు. కానీ నయీమ్ దగ్గర ఎవరూ లేరు. ఒంటరిగా పడి ఉంటాడు. అడపాదడపా ఆ గదిలోకి వచ్చిన వాళ్ళు, 'మీ దగ్గర అటెండెర్ ఎవరూ లేరా? మరి ఎవరూ లేకుంటే చాలా కష్టమే... అంటూ చెప్పి మరీ వెళ్తున్నారు.

అతనికి నా అన్న వాళ్ళు ఎవరూ లేకపోయారు. ఎప్పుడో ఏ స్నేహితుడో వస్తే కొద్దిసేపు ఉండి వెళ్ళిపోతున్నారు. అక్కడ ఉన్న నర్సులు, డాక్టర్లు తమతమ డ్యూటీలను నిర్వహించి వెళ్ళిపోతున్నారు.

తలనొప్పి వచ్చినా, కాలునొప్పి వచ్చినా ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి. అతని హృదయం దేనికోసమో ఆరాటపడసాగింది. అతను ఇంటికి వచ్చినా అదే పరిస్థితి.

వయసు మీరుతున్నది. అడపాదడపా ఒంట్లో బాగుండటంలేదు. ఏ అర్థరాత్రో అపరాత్రో తనకేమయినా అయిందంటే చూసే దిక్కులేదు. అప్పటికీ పెద్ద మొత్తం ఇచ్చి నౌకరును పెట్టుకున్నాడు. కానీ అతనిపై నమ్మకం కలగటంలేదు. అతను పనులను నిజాయితీతో, నిబద్ధతతో చేయటం లేదనిపిస్తోంది.

జీతం కోసం చేస్తున్న మనిషి అంతకంటే ఎక్కువ ఏం చెయ్యగలడు? తనకే గనక భార్యాపిల్లలు కలిగి ఉంటే ఒక కుటుంబం ఏర్పడి ఉండేది. తనకు మనోస్థైర్యంగా ఉండేది. తన వాళ్ళు ఉన్నారనే ధైర్యంతో జీవించేవాడు. ఇప్పుడు ఎవరి కోసం జీవించాలనిపిస్తోంది. జీవితమంటేనే విరక్తి కలుగుతోంది.

ఒంటరితనం అనుభవిస్తున్నాడు. మతిభ్రమిస్తోంది. ఆనాడు పెళ్ళి వద్దని,తోడు అవసరం లేదని విర్రవీగాడు. ఈనాడు ఒంటరితనంలో ఎవరి తోడు లేకుండా జీవిత పరమార్థం తెలియక అజ్ఞానంతో ప్రవర్తించాడు. పెళ్ళి చేసుకోవటం 'సున్నత్' అని ఏనాడో బోధించారు ప్రవక్త. వాటిని ఉల్లంఘించటమే దీని పర్యవసానం.

సిద్ధాంతాలకు, ఆశయాలకు, నియమ నిబంధనలకు ఎదురీగి జీవించాలంటే దాని ఫలితం ఇలాగే ఉంటుంది.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్

59 ఆయత్‌లు

# 44. అద్ దుఖాన్

మక్కా అవతరణ

5 – 9 మేము ఒక సందేశహరుణ్ణి పంపాలని అనుకున్నాము, నీ ప్రభువు కారుణ్యం రూపంలో.[4] నిస్సందేహంగా ఆయనే సర్వం వినేవాడు, సమస్తం తెలిసినవాడు[5] ఆకాశాలూ, భూమికీ ప్రభువు, ఆకాశాలూ భూమికీ మధ్యనున్న ప్రతిదానికీ ప్రభువు, మీరు నిజంగానే నమ్మకం గలవారయితే.[6] మరే ఆరాధ్యుడూ లేడు ఆయన తప్ప.[7] ఆయనే జీవితాన్నీ ప్రసాదిస్తాడు, మరాయనే మృత్యువునీ ఇస్తాడు;[8] మీకూ ప్రభువే, లోగడ గతించిన మీ పూర్వీకులకూ ప్రభువే. (కాని వాస్తవంగా ఈ జనానికి నమ్మకం లేదు) నిజానికి వీరు ఆశంకలో పడి ఆటాడుకుంటున్నారు.

4. అంటే, ఈ గ్రంథం ఇచ్చి సందేశహరుణ్ణి పంపడం కేవలం వివేకం కోరే ఆవశ్యకత మటుకే కాదు, పరమ ప్రభువు అల్లాహ్ కారుణ్యం కోరే ఆవశ్యకత కూడా అదే. ఎందుకంటే ఆయన ప్రభువు. ప్రభువు కేవలం దాసుల శరీరాల పోషణ పట్ల శ్రద్ధ చూపడం వరకే కాదు, నిజమయిన జ్ఞానం ద్వారా వారికి దారి చూపడం కూడా ప్రభుతత్వం కోరే ఆవశ్యకతే. అలాగే సత్యాసత్యాల వ్యత్యాసాన్ని గురించి వారికి ఎరుకపరచడం, వారిని చీకటిలో తచ్చాడటానికి వదలిపెట్టకుండా కాపాడటం కూడా ప్రభువు బాధ్యతే.

5. ఈ పూర్వాపరాలలో అల్లాహ్‌కు చెందిన ఈ రెండు గుణాలను తెలుపడంలో గల ఉద్దేశ్యం ఈ వాస్తవికత పట్ల జాగరూకపరచడం – నిజ జ్ఞానం కేవలం ఆయనే అందజేయగలడు, ఎందుకంటే సమస్త యదార్థాలు ఆయనే ఎరిగినవాడు గనక. ఒక్క మానవుడు కాదు, మానవులందరూ కలసి కూడా తమ కోసం ఏదయినా జీవన విధానం నిర్దిష్టపరచుకున్నా అది సత్యమయినది, ధర్మమయినది అనడానికి ఎటువంటి గ్యారంటీ ఇవ్వడం సాధ్యపడదు. ఎందుకంటే సర్వ మానవాళి ఏకత్రమయి కూడా సర్వం వినేవాడు, సమస్తం ఎరిగినవాడు ఆ ఒక్కనికి సమానం కాజాలరు. ఒక సరయిన జీవన మార్గాన్ని నిర్ణయించడానికి అవసరమయిన సమస్త సత్యాలను పరివేష్టించడం వారి వశంలోనే లేని విషయం. ఈ జ్ఞానం కేవలం అల్లాహ్ వద్దనే ఉంది. ఆయనే (సమీ') సర్వం వినగలిగేవాడు, (అలీమ్) అన్నీ తెలిసిన వాడు. అందువల్ల ఆయనే తెలుపగలడు మానవునికి సన్మార్గ దర్శనం ఏదో, మార్గవిహీనత ఏదో, సత్య ధర్మం ఏదో, అసత్యం, అధర్మం ఏదో, మంచి ఏదో చెడు ఏదో.

6. అరేబియావాసులు స్వయంగానే అంగీకరించేవారు, అల్లాహ్ మాత్రమే విశ్వానికీ, అందులోని ప్రతి వస్తువుకూ 'రబ్' (స్వామి, పోషకుడు) అని. అందువల్ల వారికి చెప్పడం జరిగింది, మీరు అనాలోచితంగా, కేవలం నోటితోనే ఈ అంగీకారాన్ని తెలుపడం లేదు. మీకు వాస్తవంగానే ఆయన ప్రభుసత్తా, పోషణ గురించి స్పృహ, ఆయన స్వామి అన్న నమ్మకం ఉన్నట్లయితే మీరు ఈ విషయాలు అంగీకరించాలి: (1) మానవుల మార్గబోధనకు గ్రంథాన్నీ, దైవ సందేశహరుణ్ణి పంపడం, ఆయన కారుణ్య గుణానికి, ప్రభుతకు సరిగ్గా తగిన పని. (2) స్వామి అయినందున ఆయనకు హక్కు ఉంది, ఇంకా ఆయన దాసులయినందున మీ విధి, బాధ్యత కూడా–ఆయన వద్ద నుండి వచ్చిన మార్గబోధనను ఒప్పుకోవడం, వచ్చే ఆదేశానికి విధేయతా శిరస్సు వంచడం.

7. ఆరాధ్యుడు అంటే నిజమయిన ఆరాధ్యుడు; ఆయన ఆరాధన (దాస్యం, పూజ) చెయ్యడం ఆయనకు గల హక్కు.

8. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడని, కాజాలడని అనేందుకు ఇది ఆధారం, నిదర్శనం. ఎందుకంటే, ప్రాణం లేని పదార్థాలకు ప్రాణం పోసి మిమ్మల్ని సజీవ స్పృహగల మానవునిగా చేసిన వాడు, తాను కోరినంత వరకు మిమ్మల్ని జీవించనిచ్చి, తాను కోరినప్పుడు మీ జీవితాన్ని అంత మొందించగలందులకు పూర్తి అధికారాలు గలవాడు, ఇటువంటి వాని దాస్యం, ఆరాధన మీరు చెయ్యక, ఆయనకు తప్ప మరెవరికో దాస్యం చెయ్యడం, లేదా ఆయనతో పాటు ఇతరుల దాస్యమూ చెయ్యడం పూర్తిగా బుద్ధికి విరుద్ధమయిన విషయం.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (6వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ الْمَغَازِيْ

## 4. యుద్ధాల ప్రకరణం -2

(కితాబుల్ మగాజీ)

## హుదైబియా విశేషాలు

**49.** మహనీయ జాబిర్(రజి) కథనం: హుదైబియా యుద్ధ సందర్భంగా సైనికులంతా దాహంతో బాధపడాల్సి వచ్చింది. దైవ ప్రవక్త(సఅసమ్) ముందు ఒక నీటి పాత్ర ఉంది. ఆ నీటితో ఆయన(స) వుజూ చేశారు. సహచరమాన్యులు దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయ్యారు. "ఏమిటి సంగతి?" అని అడిగారు కారుణ్య మూర్తి(స). దానికి వారు, 'దైవప్రవక్తా! ప్రస్తుతం మా దగ్గర నీరు లేదు. వుజూ చేయడానికి గానీ, త్రాగడానికి గానీ బొత్తిగా నీళ్ళు లేవు. మీ వద్ద పాత్రలో ఉన్న నీరు మాత్రమే ఉంది' అని విన్నవించుకున్నారు. దైవప్రవక్త(స) తన చేతిని ఆ పాత్రలో ముంచారు. అప్పుడు నీరు ఆయన(స) చేతివ్రేళ్ళ మధ్యలో నుండి నీటి బుగ్గలా పెల్లుబికింది. ఉల్లేఖకుడు ఇలా అన్నారు: 'మరి మేమంతా దాహం తీర్చుకున్నాము. వుజూ చేసుకున్నాము'. (సాలిమ్ ఇలా అన్నారు) 'మీరంతా ఎంతమంది ఉన్నారు?' అని నేను జాబిర్(రజి)ను అడిగితే, 'ఒకవేళ మేము లక్ష మందిమి ఉన్నా ఆ నీరు మాకు సరిపోయేది. అయితే ఆ సమయంలో మా సంఖ్య **1500** వరకూ ఉంది' అని ఆయన చెప్పారు.

**55)** తన తండ్రి తనతో చెప్పారని జైద్ బిన్ అస్లమ్(రజి) తెలిపారు: ఆయన తండ్రి ఇలా చెప్పారు– నేను ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)తోపాటు మార్కెట్‌కు వెళ్ళాను. ఒక నవ యువతి ఉమర్(రజి)ను కలుసుకుని ఇలా విన్నవించుకుంది: 'విశ్వాసుల నాయకా! నా భర్త చనిపోయారు. ఆయన తన వెనుక కొంతమంది చిన్న చిన్న పిల్లల్ని వదలిపోయారు. అల్లాహ్ తోడు! ఇప్పుడు ఆ పిల్లలకు వండి పెట్టడానికి (కనీసం) మేక కాలిగిట్టలు కూడా లేవు. పంట పొలాలు గానీ, పాలిచ్చే పశువులు గానీ లేవు. వారు దారిద్ర్యంలో ఆకలిదప్పికలతో చచ్చిపోతారేమోనన్న భయం నాకు ఉంది. నేను ఖుఫాఫ్ బిన్ ఈమా అల్ గిఫారీ(రజి) కుమార్తెను. నా తండ్రి దైవప్రవక్త(సఅసమ్)తో కలసి హుదైబియా సంగ్రామంలో పాల్గొన్నారు'. అది విని మహనీయ ఉమర్(రజి) కొన్ని క్షణాలపాటు నిశ్చేష్టులై నిలబడిపోయారు. ఆ తరువాత ఇలా అన్నారు: "అలాగా అమ్మా! నీ వంశీయులకు మా వంశం వారితో (ఖురైషులతో) దగ్గరి సంబంధం ఉంది". తరువాత ఆయన ఇంట్లో కట్టబడి ఉన్న ఒక బలమైన ఒంటెవైపు తిరిగి, దాని వీపుపైన ఆహార ధాన్యం నిండి ఉన్న రెండు గోనెసంచులను మోపి, ఆ సంచుల మధ్యలో కొంత నగదును, నిత్యావసర వస్తువుల్ని, బట్టల్ని కూడా ఉంచారు. ఆ ఒంటె త్రాడును ఆమె చేతికిస్తూ "వీటిని తీసుకెళ్ళు. ఇవి అయిపోకముందే, అల్లాహ్ వీటికన్నా మేలైన వస్తువుల్ని నీకు సమకూరుస్తాడు" అని ఓదార్చారు. అక్కడ ఉన్న ఒక వ్యక్తి 'అమీరుల్ మోమినీన్! మీరు ఆమెకు చాలా ఎక్కువ ఇచ్చారేమో!' అని అభిప్రాయపడగా, "(ఒరేయ్ దౌర్భాగ్యుడా!) నీ తల్లి నీ స్థితిపై రోదించుగాక! దైవసాక్షిగా! ఈమె తండ్రి, ఈమె సోదరుడు ఇప్పటికీ నా కళ్ళ ముందు కదలాడుతూ ఉన్నట్లే ఉంది. సుదీర్ఘకాలం పాటు ఒక కోటను ముట్టడించినప్పుడు వారు నాతోనే ఉన్నారు. ఎట్టకేలకు ఆ కోట కైవసం అయింది. తెల్లవారాక మేము వారిద్దరికి చెంద వలసిన యుద్ధప్రాప్తిని వసూలు చేశాము" అని చెప్పారు.

**56)** సయీద్ బిన్ ముసయ్యిబ్‌తో ఆయన తండ్రి (ముసయ్యిబ్ బిన్ హిజ్న్) ఇలా చెప్పారు : "నేను ఆ వృక్షాన్ని (విధేయతా ప్రమాణం ఏ చెట్టు క్రింద జరిగిందో దానిని) చూశాను. కాని తరువాత నేను అక్కడికి వచ్చినప్పుడు, దానిని గుర్తుపట్ట లేకపోయాను"– 'తరువాతి కాలంలో ఆ వృక్షం ఏదో నాకు జ్ఞాపకం లేకుండా పోయింద'ని మహ్మూద్ బిన్ గీలాన్ తెలిపారు.

# భారత ముస్లిములు- బాధ్యతలు

**- ఎస్. ఎమ్. మలిక్**

**"ముస్లిములు మన సోదరులు కారా?..."**

ఓ హతుని మాతృమూర్తి "ఉమా" ఆవేదన. అది మన దేశంలోనే ఉత్తరావనిలో ఓ పట్టణం. ఓ యువకుడు మరో యువకుణ్ణి వెంటాడి, పరుగులు తీయించి మరీ హత్య చేశాడు. తరువాత పట్టుబడ్డాడు హంతకుడు. హతుడు బ్రాహ్మణ యువకుడని తెలిసింది. హంతకుణ్ణి ఆరా తీయగా అతను సయితం బ్రాహ్మణుడే అని తేలింది. తాను హతుణ్ణి ముస్లిమ్‌గా అనుమానించి అలా చేశానని ఒప్పుకున్నాడు హంతకుడు పోలీసుల సమక్షంలో. ఆ సందర్భంలో హతుని తల్లి హృదయ విదారకంగా రోదిస్తూ పలికిన మాటలే పైన ఉటంకించాము.

మత మౌఢ్యంతో అతలాకుతలమవుతున్న నేటి దురదృష్టకర వాతావరణంలో ఓ కరుణామయి, తల్లి ఆంతర్యాన్ని చీల్చుకుని వచ్చిన ఆవేదన అది.

మతం అనీ, కులం అనీ, భాష అనీ, ప్రాంతమనీ చిచ్చు రగులు తున్న ఈ రోజుల్లో 'ఉమా' దేవి వంటి మానవతా మూర్తులు, ఈ సువిశాల ఉపఖండంలో, పవిత్ర భూభాగంలో కోకొల్లలు. వెతికి తీయనవసరం లేదు. కశ్మీరం నుండి కన్యాకుమారి వరకు, అసోం నుండి రాజస్థాన్ వరకు, ఉత్తర దక్షిణాలుగా, తూర్పు పడమరలుగా ఏ ప్రాంతానికి వెళ్ళినా, ఇటువంటి భారతదేశ ఆత్మలు సజీవంగా ఉమాదేవీల రూపంలో, రజియా సుల్తానాల స్వరూపంలో దర్శనమిస్తారు. ఈ దేశ నిజ స్వరూపం, సహజ రూపం ఇదే!!

## ముస్లిములు

ఈ పుణ్యావనిలో మీరూ నేనూ పుట్టక మునుపు నుంచి మత కలహాలనే మారణ హెూమాలు ఎన్ని సాగినా హిందువులను రక్షించిన ముస్లిములు, ముస్లిములను కాపాడిన హిందూ సోదరీ సోదరులు, ఎప్పుడూ ఏ మాత్రం కొరవడలేదు. దేశమంతటా విస్తరించి ఉన్నారు. ఇటువంటి సుహృదయ, సహృదయ దృశ్యాలు దాదాపు వెయ్యేళ్ళుగా కనులపండువ చేస్తూనే ఉన్నాయి. అయితే మానవుడు బహుధా అల్ప జ్ఞాపకశక్తి గలవాడు, అప్పుడప్పుడు అతను తన కర్తవ్యం పట్ల ఏమరుపాటుకు గురవుతూ ఉంటాడు, గుర్తు చేస్తూ ఉండటం అవసరం, సముచితం, బాధ్యులయిన టువంటి వారి బాధ్యత.

దేశంలో ఉమాదేవి వంటి వారిని, సుహృద్భావ వాతావరణాన్ని కాపాడగోరే వారిని బలోపేతం చేస్తూ ఉండటం అవసరం. దీనికి భిన్నంగా ఆలోచించేవారిని,వారెవరయినా తిరిగి ఈ సదాలోచనల వైపునకు మరలించడం అవసరం. ఇది ముస్లిముల బాధ్యత, కర్తవ్యం.

ముస్లిములు ఏవిధంగానూ ఒక జాతి కాదు. వారు ఒక 'ఉమ్మత్', 'మిల్లత్'. జాతి అంటే ఒక దేశం ఎల్లల్లో పుట్టినవారు, ఒక తెగ లేక కులం రీత్యా సోదరత్వం గల ఓ సమూహం. కాని 'ఉమ్మత్' లేదా 'మిల్లత్' అంటే అలా కాదు. ఈ సముదాయం ఒక సిద్ధాంతాన్ని అనుసరించే, అవలంబించే సముదాయం, ఒక మిషన్ (Mission), ఒక ఉద్యమ ధ్వజవాహకుల సముదాయం. ఓ సందేశాన్ని అందజేసే, సందేశ వాహకుల సముదాయం. అటువంటి వారినే ఉమ్మత్ అనీ, మిల్లత్ అనీ అంటారు. అది ఓ బాధ్యతాయుత సముదాయం! ఈ సముదాయ నిర్మాణమే ఓ బాధ్యత ఆధారంగా జరిగింది!!

## బాధ్యత?

ముస్లిమ్ సముదాయం నిర్వహించవలసిన ఆ బాధ్యత ఏమిటి? ఈ బాధ్యతను నేనూ మీరూ నిర్వచించవలసిన అవసరం లేదు. పరమ ప్రభువు, సృష్టికర్త ఈ సముదాయాన్ని నిర్మించి, దానికి బాధ్యతను అప్పగించిన స్వామి స్వయంగానే తన అంతిమ గ్రంథంలో దాన్ని స్పష్టపరిచాడు.

> **"ఈ విధంగానే మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ సముదాయంగా నిర్మించాము, తద్వారా మీరు ప్రపంచ జనులకు సాక్ష్యంగా నిలువాలని." (అల్ బకర : 143)**

జనుల సమక్షంలో దేనికి సాక్ష్యంగా నిలువాలి? సత్యానికి, ధర్మానికి, మంచికి!

**"ఇక ప్రపంచంలో మానవుల మార్గదర్శనానికి, సంస్కరణకు**

**రంగంలోకి దింపబడిన ఉత్తమ సముదాయం మీరే! మీరు మంచిని ఆదేశిస్తారు, చెడును నిరోధిస్తారు, దైవాన్ని విశ్వసిస్తారు." (ఆలె ఇమ్రాన్ : 110)**

ప్రపంచ జనుల సమక్షంలో సత్యానికి సాక్షులుగా నిలిచేవారు, మంచిని చెయ్యండి అని ఆదేశించేవారు, చెడును నిరోధించేవారు అంటే తమ చుట్టూ ఉన్న జనుల్ని, సమాజాన్ని మంచి వైపునకు, నిర్మాణం వైపునకు నడిపేవారు, చెడుదారుల నుండి మరలించే వారు, మానవాళి యావత్తును దైవాన్ని నమ్మేవారుగా మలిచేవారు ఈ సముదాయంలోని వారేనన్నమాట! ఈ సకల గుణాలను జనావళికి బోధించేవారు, జనులకు ఈ సందేశాన్ని అందజేసే వారు మాత్రమే కాక, ఈ సందేశానికనుగుణంగా ఆచరించి ఆచరణాత్మకంగా తమ సందేశానికి సజీవ సాక్షులుగా నిలబడాలి.

## సత్య సాక్ష్యం

ఏ మంచి వైపునకు వారు అందరినీ ఆహ్వానిస్తారో దానికి నిజమయిన ఆదర్శంగా స్వయంగా తమ జీవితాలనే మలుచుకుని, తాము బోధించే సత్య సందేశానికి తాము మూర్తీభవించిన సత్యంగా ఆదర్శనీయమయిన ధర్మపథ గాములుగా, న్యాయ బద్ధులయిన సత్య స్వరూపులుగా నిలువాలి. అందువల్ల వారు సాధారణ సమాజాన్ని వీడి వేరుగా నివసించలేరు. సామాన్య సమాజంలోనే, అందరి మధ్య అందరితోపాటు జీవించవలసి ఉంటుంది, వేరుగా కాలనీలు కట్టుకుని జీవించడం వారికి సముచితమయిన, సమంజసమయిన, తగిన విధానం కాదు, కాజాలదు.

## భిన్నత్వంలో ఏకత్వం

భారతదేశం వైవిధ్యాల సమాహారం. ఇక్కడి నైసర్గిక స్వరూపం, వాతావరణమేకాక, జనులు, వారి స్వరూపాలు, వారి రంగులు కూడా భిన్నమయినవే. వారి భాషలు, భాషల యాసలు సయితం భిన్నమయినవి. వేష భాషలు, అలవాట్లు, సభ్యతా సంస్కృతులు కూడా భిన్న రకాలు, పైగా జనుల మధ్య కులాల తేడా, మతాల భేదం కొట్ట వచ్చినట్లు కానవచ్చే తారతమ్యాలు! అందువల్లనే భారతదేశం సహజంగానే ఓ ఉపఖండం గుణాలన్నీ సంతరించు కున్న దేశం!!

ఈ ప్రజల్లో ఎన్ని వ్యత్యాసాలున్నా, ఎన్ని తారతమ్యాలున్నా, ఎన్ని భేదభావాలున్నా, ఎన్ని వైవిధ్యాలున్నా ఇదొక మానవ సమాజమే! ఇస్లామ్ దృష్టిలో మానవుడు, మానవుడు కావటాన, ఏ దేశానికి చెందినవాడయినా, ఏ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించినా, ఏ రంగు గల వాడయినా, ఏ భాష మాటలాడేవాడయినా, ఏ కులానికి సంబంధించిన వాడయినా, ఏ మతాన్ని అవలంబించే వాడయినా మానవుడే కాబట్టి గౌరవనీయుడు, ఆదరణీయుడు!! కుర్ఆన్ ఘంటాపథంగా చాటుతుంది- **లకద్ కర్రమ్నా బనీ ఆదమ్!**

> **"మేము నిశ్చయంగా ఆదమ్ సంతానానికి (మనిషిని) ఆదరణీయత (గౌరవం) అనుగ్రహించాము!" (బనీ ఇస్రాయీల్ 17: 70)**

## అత్యుత్తమ సృష్టి

సృష్టికర్త మానవుణ్ణి తన సృష్టి యావత్తులో అత్యుత్తమ సృష్టిగా సృజించినట్లు పలు చోట్ల వక్కాణించాడు దివ్య కుర్ఆన్‌లో-

> **"మేము మానవుణ్ణి అత్యుత్తమ రూపంలో సృష్టించాము." (అత్ తీన్ 95: 4)**

ప్రవక్త మహనీయులు(స) మానవుని ధన మాన ప్రాణాలు పవిత్రమయినవని చాటారు. ఇవన్నీ తెలిపేదేమిటి? మానవుడు మానవునిగా ఆదరణీయుడు, సర్వసాధారణంగా అతని ప్రాణం, శరీరం, మానమర్యాదలు, అతని సొత్తు సర్వం పవిత్రమయినని. వాటిపైకి దుష్ట బుద్ధితో దృష్టి సారించడం కూడా పాపమే! అపరాధమే!!

మానవుల మధ్య వ్యత్యాసాలు- వర్ణం, వర్గం, భాష, ప్రాంతం, సభ్యత, సంస్కృతి, నాగరికత, జ్ఞానం, బుద్ధికుశలత, అలవాట్లు సంప్రదాయాలు- అన్నింటిరీత్యా వైవిధ్యం సృష్టిరీత్యానే నెలకొని ఉన్నాయి. ఈ వైవిధ్యం (Diversity) సృష్టి ప్రారంభం నుంచీ ఉంది, సృష్టి అంతం వరకూ ఉంటుంది. ఈ వైవిధ్యంలో ఏకత్వం (Unity)ని సాధించవలసి ఉంటుంది. కేవలం బాహ్యపరమయిన వైవిధ్యం, వ్యత్యాసమే కాదు, విశ్వాసాల రీత్యా, ఆలోచనల రీత్యా, అభిప్రాయాల రీత్యా కూడా వ్యత్యాసం ఉంది. ఉంటుంది కూడా. ఎందుకంటే ఇస్లామ్ ప్రకారం **'లా ఇక్రాహ ఫిద్దీన్'** 'ధర్మం, ఆలోచనలు, నమ్మకాల విషయంలో బలవంతం నిషిద్ధం'. ఎవరి అభిప్రాయాలనయినా వారి ఇష్టం ప్రకారమే తప్ప అన్యధా మార్చడానికి ఇస్లామ్ ఒప్పుకోదు, ఇష్టపడదు, బలవంతాన మార్చడాన్ని నిరసిస్తుంది. ఈ వైవిధ్యం- ఈ అవశ్యమయిన ఏకత్వం- రెండూ సహజీవనం చెయ్యడం నిశ్చిత విషయం!

## హేతుబద్ధమయిన చర్చ

ఈ వైవిధ్యాల మధ్య ఏకత్వం, సమైక్యత సాధించడానికి, ఒకరిని గురించి మరొకరు సరిగ్గా అవగతపరచుకునేందుకు మనుషుల మధ్య హేతుబద్ధమయిన చర్చ (Logical Debate) జరుగుతూ ఉండే సామరస్య పూర్వకమయిన వాతావరణం నెలకొనడం అవసరం. దాన్ని సజీవంగా ఉంచడం ముస్లిముల బాధ్యత. 'వ **జాదిల్హుమ్ బిల్లతీ హియ అహ్సన్!**

**"(అవసరమయితే వారితో తర్జన భర్జన జరపండి, అత్యుత్తమ రీతిలో)" (అన్ నహ్ల్ 16: 125)**

ఎన్ని చర్చలు జరిగినా మృదువుగా, మధురంగా, ప్రేమగా జరగాలి.

ఈ వైవిధ్యాల మధ్యనే ముస్లిములు సహజీవనం సాగించవలసి ఉంటుందని, తమ సందేశం ఆహూతులకు సజావుగా చేరగలగాలంటే ఇదొక్కటే సరయిన సమంజసమయిన మార్గమని ముస్లిమ్ సముదాయం ఎంత త్వరగా గ్రహిస్తే అంతే శుభకరం! ఇది వారి బాధ్యత!! ఇటువంటి వాతావరణం నెలకొనలేకపోతే ఇరుకయిన వాతావరణం (Suffocation)లో శ్వాస పీల్చడం కూడా దుర్భరమయిపోతుంది, సంభాషించడం బహు దూర విషయం! ఇటువంటి వాతావరణమే ప్రజాస్వామిక విలువల (Democratic Values)కు ఆయువుపట్టు అని మరువకూడదు.

సాధారణంగా వినవచ్చే మాట ఏమిటంటే, 'ముస్లిమేతర సోదరుల్లో ఇస్లామ్‌ను గురించి, ముస్లిములను గురించి అనేకానేక అపార్థాలు, అపోహలు పేరుకుపోయాయి. వాటిని దూరం చేయడం అవసరం' అని. అయితే ఈ అపోహలూ అపార్థాలకు తావు కల్పించిందెవరు? ముస్లిములు తమ్ముతాము సామాన్య సమాజానికి ఎడంగా, దూరంగా, ఇటీవల మరీను, కాలనీలు కట్టుకుని జీవిస్తూ ఉంటే ఏమవుతుంది? ముస్లిములు వేర్వేరుగా నివసించడమే కాదు, ఇతర ప్రాంతాల నుండి ముస్లిమ్ సోదరులు తరలివస్తూ ఉంటే వారిని ఆహ్వానిస్తున్నారు. ఈ విధంగా తమను గురించి అపార్థాలు పెరిగేందుకు దోహదపడుతున్నారు! ముస్లిములు ఎంతెంతగా వేర్పాటు ధోరణిని (Isolation)ని అనుసరిస్తారో అంతగానే ఈ అపార్థాలు, అపోహలు పెరుగుతూ, పేరుకుంటూ పోతాయి. ఈ సత్యాన్ని మరువకూడదు ముస్లిములు.

## తమ పరిచయం...

ముస్లిములు ఈ దేశంలో శతాబ్దాల తరబడి నివసిస్తూ ఉన్నా, తొలి రోజుల్లో తమ్ముతాము పరిచయం చేసుకున్న రీతిలో, తమ విశ్వాసాలను, తమ సంప్రదాయాలను తెలియపరచుకున్న తీరులో, నేడు పరిచయం చేసుకుంటున్న సందర్భాలెన్ని? అసలు లేవు. ముస్లిములు, ముస్లిమ్ నేతలు ఆత్మావలోకనం చేసుకోవలసిన తరుణం ఇది. అది ఇంకా రాలేదా??

ముస్లిములు ఎంతగా ఇక్కడి మిశ్రమ సమాజం, బహుముఖ సమాజం (Plural Society) నుండి దూరం జరగాలని యత్నిస్తున్నారో అంతకన్నా అధికంగా కొందరు పనిగట్టుకుని వారిని సామాన్య జనావళికి దూరం చేయాలని కుట్రలు పన్నుతున్నారు. ఆ విధంగా ముస్లిములు భారతీయ సమాజానికి మరింత దూరమయి పోతున్నారు.

అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) బోధించిన నైతికావళి ప్రకారం ముస్లిములు సాధారణ సమాజానికి వేరుగా జీవించలేరు. వారు తమ్ము తాము సర్వజనులకు సరిగ్గా పరిచయం చేసుకోవలసి ఉంది. వారు ప్రేమ, గౌరవం, సమానత్వం, సోదర భావం తొణికిసలాడే కుల మత సామరస్య పూర్వకమయిన వాతావరణాన్ని సృజించవలసి ఉంది. అప్పుడే వారు తమ సందేశాన్ని, దైవ విధేయతా ధర్మమయిన ఇస్లామ్ సందేశాన్ని చేరవేయగలుగుతారు. అప్పుడే ప్రవక్త మహనీయులు ఆదర్శంగా నిర్మించిన సామరస్య పూర్వకమయిన సమాజాన్ని పునర్నిర్మించగలుగుతారు.

## వైవిధ్యభరిత మిశ్రమ సమాజం

ఇస్లామ్ ముస్లిములను మిశ్రమ సమాజంలో, వైవిధ్య భరిత సమాజంలో జీవించడం ఎలానో నేర్పుతుంది. ప్రవక్త మహనీయులు(స) మదీనాలో మిశ్రమ సమాజంలోనే తన సహచర మాన్యులతో కూడిన సముదాయంతోపాటు జీవించారు, దౌత్య కాలంలో అత్యధికంగా. మక్కాలో పదమూడేళ్ళు వైరుధ్య భరితమయిన సమాజంలో గడిపితే, ఆ తరువాత మదీనాలో పదేళ్ళు వైవిధ్య భరితమయిన సమాజంలో గడిపారు. ఆ జీవితాన్నే ముస్లిములు ఆదర్శంగా గ్రహించి అలవరచుకోవడం అవసరం.

తమ వ్యక్తిగత జీవితంలోనూ సామూహిక మనుగడలోనూ ప్రవక్త ఆదర్శాన్ని అనుసరిస్తూ తోటి దేశవాసులయిన సోదరులందరితో ఆచరణాత్మకంగా సోదర సంబంధాలు పెంపొందించుకోవడం అత్యంతావశ్యకం. తాము కలివిడిగా నివసిస్తూ కుటుంబ సంబంధాలు ఏర్పరచుకోవడం, వాటిని పెంపొందించుకోవడం, సహజీవనం సాగించడం తమ ధార్మిక బాధ్యత రీత్యా కూడా అవశ్యమయినదే.

తాము చేసే సంఘసేవా కార్యకలాపాలను సోదర దేశవాసుల వరకు సయితం విస్తృత పరచడం, వారితో సత్సంబంధాలకు సాయపడుతుంది. తమ సమస్యలతో పాటు తోటి సోదరుల సమస్యలను సయితం తమ సమస్యల వలెనే తీసుకుని ముందుకు సాగవలసి ఉంటుంది. తమ సేవల ద్వారా ప్రయోజనం పొందే వారి (Beneficiaries)లో సోదర దేశవాసుల్నీ చేర్చుకోవాలి. ఇదే ఇస్లామ్ ముస్లిములకు నేర్పే విధానం. అప్పుడే వేర్వేరు మతావలంబీకుల మధ్య, సముదాయాల మధ్య సమైక్యత, సామరస్యం, సుహృద్భావం, ఆరోగ్యవంతమయిన వాతావరణం, స్వేచ్ఛగా అభిప్రాయాల వెల్లడి సంభవమవుతుంది.

దైవం మన కృషిని ఫలవంతం చేయాలన్న ప్రార్థన...

---

*ప్రేరణ : టి.ఆరిఫ్ అలీ, ప్రధాన కార్యదర్శి, జమాఅతె ఇస్లామీ హింద్.*

# గుజరాత్ మరచిపోయిన ఇస్లామిక్ చరిత్ర

- ముహమ్మద్ అజ్గర్ అలీ

**భారత** ఉపఖండంలో ఇస్లాం దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం, 7వ శతాబ్దంలో, తూర్పు ఆఫ్రికా, అరబ్ వ్యాపారులతో హిందూ మహాసముద్రంలో వాణిజ్యం ద్వారా గుజరాతీ–దక్షిణాన కొంకణ్, మలబార్ తీరాలకు మొదట చేరుకుందని ఆధారాలు సూచిస్తున్నాయి.

ప్రపంచంలోని పురాతన మసీదులలో ఒకటి, కేరళలోని చెరామన్ జుమా మసీదు. ఈ మసీదు క్రీ.శ. 629లో నిర్మించబడిందని, కొన్ని సంవత్సరాల తర్వాత తమిళనాడులో పాలయ్య జుమ్మా పల్లి మసీదు నిర్మించబడిందని తెలుస్తోంది. ప్రముఖ యాత్రికుడు ఇబ్నె బతూతా, 14వ శతాబ్దంలో ఢిల్లీ సామ్రాజ్యంలో ఖాజీ (న్యాయమూర్తి)గా కూడా పనిచేశాడు.

10వ శతాబ్దంలో, ముస్లిం అరబ్ భౌగోళిక శాస్త్రవేత్త, చరిత్రకారుడు ఇబ్నె హవ్కల్, గుజరాత్‌లోని నాలుగు నగరాలు–క్యాంబే, కచ్, సైమూర్, పటాన్‌లలో మసీదులను గమనించాడు.

భారత ఉపఖండంలోని గుజరాత్ ముస్లింల శతాబ్దాల సుదీర్ఘ ఉనికి గురించి తెలుసుకొందాము.

### 1. చంపానేర్- పావగఢ్ పురావస్తు ఉద్యాన వనం

గుజరాత్‌లోని బరోడా నగరానికి వెలుపల నలభై ఏడు కిలోమీటర్ల దూరంలో, 8వ శతాబ్దంలో నిర్మించబడిన యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం, చంపానేర్– పావగఢ్ పురావస్తు ఉద్యాన వనం ఉంది.

చంపానేర్ 16వ శతాబ్దానికి చెందిన చారిత్రక నగరం. చంపానేర్‌ను గుజరాత్ సుల్తాన్ మహ్మూద్ బెగడ నిర్మించారు. పావగఢ్ కొండలపై ఉన్న కోటలు చంపానేర్ చుట్టూ ఉన్నాయి. ఒకప్పుడు చంపానేర్ గుజరాత్ రాజధాని. చంపానేర్‌లో క్లిష్టమైన డిజైన్‌లు గల రాజభవనాలు, మసీదులు, మందిరాలు, మెట్ల బావులు ఉండేవి.

చంపానేర్–పావగఢ్ రాజభవనాలు ఇస్లామిక్, హిందూ వాస్తుశిల్పం రెండింటి కలయిక కలిగి ఉన్నాయి.

### 2. హాజీరా మఖ్‌బా

చంపానేర్–పావగఢ్ పురాన షెహర్‌లో హాజిరా మక్బరా ఉంది. 1586లో నిర్మించబడిన హజీరా మక్బారాలో అక్బర్ కుమారుడు, వారసుడు అయిన జహంగీర్‌కు శిక్షకుడు అయిన కుతుబుద్దీన్ ముహమ్మద్ ఖాన్ సమాధి ఉంది. హాజిరా మక్బరాలోని సమాధి, దాని చుట్టుపక్కల ఉన్న ఉద్యాన వనాలు ఒక మనోహరమైన అనుభవాన్ని అందిస్తాయి. ప్రస్తుతం హాజిరా మక్బరాను ఇస్మాయిలీ షియా కమ్యూనిటీ సభ్యులు పరిరక్షిస్తున్నారు.

### 3. లక్ష్మీ విల్లాస్ ప్యాలెస్

లక్ష్మీ విల్లాస్ బరోడాలోని గైక్వాడ్స్ పూర్వపు ప్యాలెస్. హిందూ గైక్వాడ్ రాజవంశం బరోడా సామ్రాజ్యాన్ని 18వ శతాబ్దం ప్రారంభం నుండి 1945 వరకు పాలించింది. సయాజీరావ్ గైక్వాడ్– III (1875–1939) పాలనలో బరోడా భారతదేశంలో ప్రగతిశీల రాజ్యాలలో ఒకటిగా పరిగణించబడింది.

1890లో నిర్మించబడిన, లక్ష్మీ విల్లాస్ సొగసైన, ఆడంబరమైన ఇండో–సార్సెనిక్ శైలిని కలిగి ఉంది. ఇండో–ఇస్లామిక్, 'సాంప్రదాయ' భారతీయ వాస్తుశిల్పం రెండింటినీ లక్ష్మీ విల్లాస్ కలిగి ఉంది. లక్ష్మీ విల్లాస్ వంపు కిటికీల ఫ్రేమ్‌లపై క్లిష్టమైన పూల డిజైన్‌లు, బంగారంతో మెరిసే మొజాయిక్‌లు, అద్భుతమైన దర్బార్, హాథీ(ఏనుగు) హాళ్లు కలిగి ఉంది. లక్ష్మీ విల్లాస్ ప్యాలెస్ వాస్తు శైలి గుజరాత్‌లో ఇస్లాం ఉనికికి నిదర్శనంగా గుర్తిస్తుంది.

చంపానేర్–పావగఢ్ పురావస్తు ఉద్యాన వనం, హాజిరా మక్బరా, లక్ష్మీ విల్లాస్ ప్యాలెస్‌లు గుజరాత్‌లో ఇస్లాం దీర్ఘకాల ఉనికిని సూచిస్తాయి.

❖

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**గత సంచిక తరువాయి**

### ఈ అప్పులతో తప్పవు తిప్పలు..

కుళాయిలోంచి ధారాపాతంగా నీళ్లు పడుతున్నా బకెట్ మాత్రం నిండటం లేదంటే... ఎక్కడో చిల్లులున్నాయని అర్థం. నెలంతా కష్టపడుతున్నా, మొదటి వారంలోనే పర్సు ఖాళీ అవుతోందంటే... వృథా వ్యయాలు పెరిగిపోయాయని భావం. ఎంత సంపాదిస్తు న్నాం, ఎంత ఖర్చు చేస్తున్నాం, ఎంత మిగుల్తోంది. ఆ మిగులును ఎటువైపు మళ్లిస్తున్నాం... అనే స్పష్టత ప్రతి ఒక్కరికీ ఉండాలి. ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, సెల్‌ఫోన్, కారు, ఫర్నిచర్... ఇలా అత్యవసరం కాని వస్తువుల కోసం అత్యవసరంగా అప్పు చేయడం ఏమంత తెలివైన నిర్ణయం కాదు. నిజానికి ఎలక్ట్రానిక్ వస్తువుల ధర కొన్న మరుక్షణమే ఓ పదిశాతం పడిపోతుంది. నాలుగైదేళ్లు గడిచేసరికి నామమాత్రం అవుతుంది. మనం మాత్రం... ప్రాసెసింగ్ ఫీజులు, డాక్యుమెంటేషన్ ఖర్చులు, వడ్డీల రూపంలో అసలు ధరకు రెట్టింపు మొత్తాన్ని సమర్పించుకుంటాం.

నేడు మన దేశంలో కార్ లోన్లకు గిరాకీ పెరుగుతోంది. ప్రత్యేకించి మధ్యతరగతి ఎగబడి తీసుకుంటోంది. నిజానికి అదో వ్యామోహ చక్రం. అప్పు చేసి మరీ కారు కొంటామా? ఏడాది తిరిగేసరికి అందులోనే కొత్త మోడల్ వస్తుంది. మనసు అటువైపు మళ్లుతుంది. ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద పాత కారును (అతి తక్కువ ధరకు అప్పగించి తళతళలాడే కొత్తబండిని తెచ్చుకుంటాం. ఫలితంగా ఇంకొంత అప్పు పెరుగుతుంది. దీనికితోడు ఇంధనం, సర్వీసింగ్, బీమా, పన్నులు... ఇలా రకరకాల ఖర్చులు ఉండనే ఉంటాయి. ఒక్క కారే కాదు, ఏ కొత్త ఉత్పత్తులనూ అప్పు చేసి కొనకూడదు. వాయిదా పద్ధతిని అసలు ఎంచుకోకూడదు. చేతిలో మిగులు సొమ్ము ఉంటేనే ఆ వైపుగా ఆలోచించాలి. అప్పు లేకపోతే చాలు, ఐశ్వర్యం ఉన్నట్లే ...అప్పులేనోడే అధినాయకుడు అని గుర్తెరిగి మసలుకోవాలి.

### పులి నోట్లో తల పెట్టడమే

అడ్డూ అదుపూ లేని క్రెడిట్ కార్డు వినియోగం కూడా మనిషిని అప్పుల ఊబిలోకి తోసేస్తోంది. సకాలంలో బిల్లు చెల్లించకపోతే... వివిధ రూపాల్లో బాదుడు తప్పదు. ఈఎమ్‌ఐ కింద మార్చు కుంటే.. వడ్డీల మోత భారీగా ఉంటుంది. ఏ కొనుగోలుకైనా

క్రెడిట్ కార్డు చిట్టచివరి చెల్లింపు మార్గం మాత్రమే. మన ఆర్థిక పరిమితుల్ని మరిచిపోయి కార్డులు గీకేయడం అంటే పులి నోట్లో తల పెట్టడమే. అందుకే - ఆనలో అప్పులున్న వాడికి, వానలో చెప్పులున్నవాడికి వెనకాల నడవకూడదు అన్నారు పెద్దలు.

## వాయిదా వేసుకోవాలి

బ్యాంకు యాప్‌లో చిన్నపాటి క్లిక్ చాలు. క్షణాల్లో అప్పు మంజూరై పోతుంది. అంతే వేగంగా మన ఖాతాలో సొమ్ము పడిపోతుంది. డాక్యుమెంటేషన్ బాధ ఉండదు. జామీనూ అడగరు. ఈ రోజుల్లో పర్సనల్ లోన్ మరీ సులభమై పోయింది. దీంతో ఏ చిన్న అవసరం వచ్చినా... వ్యక్తిగత రుణాలను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ కూడా వడ్డీల వాయింపు బాగానే ఉంటుంది. కాబట్టి, తప్పని సరైతేనే వాటి జోలికి వెళ్లాలి. విందులూ, విలాసాలూ, జీవనశైలి ఖర్చుల కోసం వ్యక్తిగత రుణాలు తీసుకోవడం సరికాదు. మరొక హెచ్చరిక. ప్రాణాల మీదికి వస్తున్నా సరే, లోన్ యాప్‌ను ఆశ్రయించ కూడదు. అదొక విష వలయం. ఒక్కసారి చిక్కుకుంటే చచ్చినా బయటపడలేం. మనల్నే కాదు, మన సన్నిహితులనూ వెంటాడతారు. నడి బజారులో నిలబెడతారు. తలనిండా పేలున్నా, ఊరినిండా అప్పులున్నా బాధ తెలియదు అంటారు ఎందుకో తెలుసా? అప్పులు ఎక్కువ చేసేవాడికి అది తప్పు అన్న స్పృహే ఉండదు గనక.

## మంచి రుణం

కొన్ని అప్పులు అసలు అప్పులే కాదు. పరోక్షమైన పెట్టుబడులు. అప్పటికప్పుడు భారంగా అనిపించినా, దీర్ఘకాలంలో మంచి చేస్తాయి. సంపదను సృష్టిస్తాయి. వీటిని గుండెకు మేలు చేసే మంచి కొలెస్ట్రాల్తో పోల్చుకోవచ్చు. గృహ రుణం కూడా ఈ జాబితాలోకే వస్తుంది. మహా నగరాల్లో ఇల్లు కొనడమంటే మాటలు కాదు. చేతిలోని కొద్దిపాటి సొమ్ముతో సొంతింటి యజమాని అనిపించుకోలేం. ఆ సమయంలో అప్పు అనివార్యం అవుతుంది. కాకపోతే, ఈఎమ్ఐ మరీ భారం కాకుండా చూసు కోవాలి. డిస్కౌంట్ ఇస్తున్నారనో, ధర తగ్గిస్తున్నారనో స్థోమతకు మించిన ఆస్తులను ఎంచుకోకూడదు. గృహ రుణానికి వెళ్లే సమయానికి మరో అప్పు లేకుండా జాగ్రత్తపడాలి. ఎందుకంటే, సగటు జీవి ఒకేసారి రెండు ఈఎమ్ఐల భారాన్ని భరించలేడు.

**విద్యా రుణం :** విద్యారుణం కూడా మంచి రుణమే. చదువు నైపుణ్యాన్ని పెంచుతుంది. ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ఉపాధి అవకాశాలను విస్తరిస్తుంది. మన కోసం తీసుకున్నా, మన పిల్లల కోసం తీసుకున్నా ఎడ్యుకేషన్ లోన్ హర్షించదగినదే!

**వ్యాపార రుణం :** సద్వినియోగం చేసుకోగలిగితే వ్యాపార రుణాలూ లాభదాయకమే. చిన్నాచితకా ఖర్చులు పోనూ పది శాతమైనా మిగులుతుంది. వ్యాపారమూ విస్తరిస్తుంది. కాకపోతే ఓ షరతు. ఆ రుణాన్ని వ్యక్తిగత అవసరాలు తీర్చుకోడానికో, పాత అప్పులు వదిలించుకోడానికో వాడకూడదు. దురాశతో స్టాక్ మార్కెట్కు మళ్లించరాదు. రియల్ ఎస్టేట్లో ఇన్వెస్ట్ చేయడమూ రిస్కే. పొరపాటున మార్కెట్ కుప్పకూలిపోతే... అసలు తీర్చలేకా, వడ్డీ కట్టలేకా సతమతమైపోతాం.

**గమనిక:** ఆ ఈఎమ్ఐలు వడ్డీ రహిత - ఇస్లామీయ చట్టానికి లోబడి ఉంటేనే తీసుకోవాలి.

## ప్రణాళిక ముఖ్యం

ఆర్థిక లక్ష్యాలు లేకపోవడం కూడా అర్థంలేని అప్పులకు ఓ కారణమే. పదేళ్లలో ఇంటి రుణం తీర్చేయాలి, పాతికేళ్లలో రిటైర్మెంట్ ఫండ్ సమకూర్చుకోవాలి, పిల్లల చదువులకు కనీసం కొన్ని లక్షలు పక్కన పెట్టాలి... ఇలా మనకంటూ కొన్ని లక్ష్యాలు పెట్టుకున్నప్పుడు, వాటి ప్రకారంగానే బడ్జెట్ రూపొందించు కుంటాం. చెత్త పెట్టుబడులతో రిస్క్ తీసుకోం. ఈఎమ్ఐ కొనుగోళ్లను ఇష్టపడం. దైనందిన ఖర్చుల్ని నియంత్రించుకుంటాం. అప్పుల జోలికే వెళ్లం.

## రాష్ట్ర, దేశ క్షేమం కూడా ముఖ్యమే

సాధారణంగా, ప్రభుత్వాలు ఎడతెగక మరీ మరీ అప్పులు చేస్తూ వడ్డీలను పెంచుకుంటూ ఉంటాయి. ఇది సాధారణమే అయినప్పటికీ, అమితంగా అప్పులు చేయడం ప్రజలను ధవవంతులుగా చేసే బదులు దారిద్ర్యాన్ని, భద్రత లేనితనాన్ని మరింత అధికం చేస్తుంది. డానిష్ సామెత చెబుతున్నట్లు, "తిన్న రొట్టెకు డబ్బు చెల్లించడం కష్టం."

బాధ్యత గల నాయకుడెవరైనా ఏం చేస్తారు? పురోగతిని పరుగు లెత్తిస్తారు... అభివృద్ధి దిశగా అడుగులు వేయిస్తారు! అలాగే

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

చేస్తారని.... రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధిపథంలో పరుగులెత్తిస్తారని... నమ్మి, ప్రజలు పగ్గాలు అప్పగిస్తే... ఎలా పాలించాలో తెలియక, అభివృద్ధి పరచటం చేతకాక రాష్ట్రాన్ని, దేశాన్ని అప్పులదిబ్బగా మార్చేస్తారు. అన్నపూర్ణను దివాలా అంచులకు చేర్చుతారు! వెనిజువెలా, అర్జెంటీనా, గ్రీసు దేశాల సరసన నిలబెడతారు! ఉద్యోగులకు సమయానికి జీతాలివ్వక జీవితాలతో ఆటాడు కుంటారు. ఈ బిల్లులు. ఆ బిల్లులంటూ, జీఎస్‌టీలు, అదనపు టాక్స్‌లు అంటూ చెవులు చిల్లు పడేలా బెల్లు మోగిస్తారు. సగటు పౌరుని వీపుకి వాతలు పెడతారు. అప్పు ఎంతలా ఎదుగుతుంది అంటే- మనిషిని, దేశాన్ని అందనంత ఎత్తు నుండి -కనపడనంత లోతులో పడేస్తుంది.

## అప్పు విషయంలో అపనమ్మకాలు

అప్పు తీసుకోవడానికి కూడా శుభ ఘడియలు మంచి రోజులు ఉంటాయంటారు. ఆ ప్రకారం- మంగళవారం, బుధవారం, శని వారాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరుల వద్ద అప్పు చేయకూడదు. అలాగే మంగళవారం రోజున తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించటం చాలా మంచిది. సోమవారం, బుధవారం, ఆదివారం రోజున అప్పు తీసుకోవడం వల్ల ఆ అప్పు తొందరగా తీరిపోతుంది అంటారు. అలాంటి నమ్మకాలకు ఇస్లాంలో చోటు లేదు. అలాగే కొందరు అప్పు కలిసొచ్చింది అని ... వారు కోట్లకు పడగలెత్తినా అప్పు తిరిగి ఇవ్వరు. ఇదో సిల్లీ నమ్మకం!

## అప్పు తప్పు చేయకండి!

మార్కెట్‌లో కనిపించే ప్రతీదీ కొనేయడానికి తొందరపడకండి. మీకు ఏవి అవసరం, వాటికోసం నిజంగా ఎంత ఖర్చు పెట్టగలరు అనేవి ఆలోచించుకుని బడ్జెట్ తయారు చేసుకోండి. అంతకు మించి ఖర్చు పెట్టకండి. అనవసరమైన అప్పులు చేయకండి. "అప్పు చేయువాడు అప్పిచ్చినవానికి దాసుడు." డబ్బుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకండి. ఒక స్వార్థపరుడు ధనికుడు కావాలని మాత్రమే కోరుకుంటాడు. ఆ మనిషి దరిద్రుడు అయ్యేందుకు చాలా దగ్గరలో ఉన్నాడని అతడు గ్రహించడు. అసూయ, అత్యాశ ఆర్థిక పతనానికి దారి తీస్తాయి. అంతేకాదు, ఆధ్యాత్మికతను హరించేస్తాయి. ఋణ బాధ్యత కుటుంబానికి, ఆరోగ్యానికి, ఆత్మీయతకు హానికరం కాగలదు. అప్పు ఋణగ్రస్థుణ్ణి మరింత పేదవానిగా చేయవచ్చు.

*జహాఁ తక్ హొసకే కిసీ సే ఖర్జ్ మత్ లేనా*
*మియా ఖరజ్ దారీ ఖైర్ ఒ బర్కత్ ఛీన్ లేతీ హై*

## అప్పు నుండి ఆదర్శ ప్రవక్త (స) శరణు కోరడం

హ॥జత్ ఆయిషా (రజి అల్లాహు అన్హా) కథనం : దైవప్రవక్త(స) నమాజులో తషహ్హుద్ తరువాత ఇలా దుఆ (ప్రార్థన) చేస్తూ ఉంటే నేను విన్నాను. అల్లాహుమ్మ ఇన్నీ అఅవూజుబిక మిన్ అజాబిల్ ఖబ్రి వ అవూజుబిక మిన్ ఫిత్నతిల్ మసీహిద్దజ్జాలి వ అవూజుబిక మిన్ ఫిత్నతిల్ మహ్యాయి వ ఫిత్నతిల్ మమాతి. అల్లాహుమ్మ ఇన్నీ అఅవూజుబిక మినల్ మాసమి వల్ మగ్రమ్.

"దేవా! నేను సమాధి యాతన నుండి నీ శరణు కోరుతున్నాను. 'మసీహిద్దజ్జాల్' ఉపద్రవం నుండి నీ శరణు కోరుతున్నాను. జీవన్మరణాల పరీక్ష నుండి నీ శరణు కోరుతున్నాను. దేవా! పాపాల్లో పడివేసే పనుల నుండి నీ శరణు కోరుతున్నాను. రుణగ్రస్తుడిని అయ్యే దుస్థితి నుండి నీ శరణు కోరుతున్నాను."

ఒక వ్యక్తి దైవప్రవక్త (స) తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! మీరు రుణగ్రస్త స్థితి నుండి కూడా అంత ఎక్కువగా శరణు కోరుతున్నా రెందుకు?" అని అడిగాడు. దానికి ఆయన సమాధానమిస్తూ "ఎందుకంటే మనిషి అప్పుల పాలయితే అసత్యమాడతాడు. వాగ్దాన భంగానికి పాల్పడతాడు" అని అన్నారు. (సహీహ్ బుఖారీ)

**ఈ హదీసులో పేర్కొనబడిన కొన్ని అంశాలు**

'జీవిత' పరీక్ష అంటే, మానవ జీవితంలో ఎదురయ్యే పరీక్షలన్నీ అని అర్థం. ఉదాహరణకు- పనికిమాలిన విషయాల్లో చిక్కుకు పోవడం, మనోవాంఛలకు బలయిపోవడం మొదలైనవి. మరణ పరీక్ష అంటే, మనిషి మరణ ఘడియల్లో దైవానుగ్రహం పట్ల నిరాశ చెందడం, సద్వచనం (కలిమా) పలకలేక పోవడం, ఇస్లాం వ్యతిరేక విషయాలు మాట్లాడటం ఇత్యాదివి. రుణగ్రస్తుడవడం అంటే, అధర్మ కార్యాలు లేక అనవసరమైన పనుల కోసం చేసే అప్పు అన్నమాట. లేదా అప్పుతీర్చే సద్బుద్ధి లేకపోవడం. నిజమైన అవసరాల నిమిత్తం అప్పు తీసుకోవడంలో తప్పులేదు. అయితే దాంతో పాటు అప్పు తీర్చే స్థోమత కూడా ఉండాలి. ఈ దుఆ (వేడుకోలు) మొదటి భాగం దేవుని హక్కులకు, రెండవ భాగం దాసుల హక్కులకు సంబంధించినది.

**(మిగతా వచ్చేవారం)**


దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

రిపోర్టు




# అందరి ప్రవక్త ముహమ్మద్ (స)

## - కవితా గానంతో చాటిచెప్పిన కవులు

**"అరేబియాకు చెందిన ఓ గొప్ప ప్రవక్త గురించి అధ్యయనం చేసిన వారికి, ఆయన ఎలా బోధించారో, ఎలా జీవించారో, తెలిసిన వారికి ఆయన పట్ల ఆదరభావం తప్ప మరో భావం కలగడం అసాధ్యం"** అన్నారు గొప్ప సైంటిస్టు అనిబిసెంట్. అవును ఆయన చెప్పినట్లుగానే ఎంతోమంది తెలుగు కవులు ఆయన జీవిత చరిత్రను అధ్యయనం చేశారు. ఆయన ఆదర్శాలను అక్షరీకరించారు. ఆయన గొప్పదనాన్ని కీర్తించారు. ఇస్లామ్ పట్ల, ముహమ్మద్ ప్రవక్త జీవితం పట్ల నానాటికీ పెరిగిపోతున్న అపోహలు, అపార్థాలను పటాపంచలు చేస్తూ హైదరాబాదులో ఓ కవి సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో కులమతాలకతీతంగా కవులు తమ కలాలను ఝుళిపించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 50మంది కవులు ఇందులో పాల్గొని ముహమ్మద్ (స) కొందరి ప్రవక్త కాదని అందరి ప్రవక్త అని నినదించారు. జీవిత సాఫల్యానికి ప్రవక్త బోధనలే స్ఫూర్తిదాయకమనే సందేశాన్ని అందించారు.

"ఆ దివ్య ఖుర్ఆన్ నిత్యం పఠించిన వారికి/ ప్రవచనాలన్నీ శ్రద్ధగా పాటించినవారికి/మరణానంతరం సైతం జీవితముందన్న అమృత సందేశాన్ని అందించిన/ ప్రపంచ శాంతికై" పరితపించిన శాంతిదూత/ మహోపకారి/" అని కీర్తించారు హైదరాబాదుకు చెందిన కవి పోలయ్య. "ఆడవారికి ఆత్మ ఉందా అని చర్చిస్తూ ఉన్న వేళ/ ఆడవారికి ఆస్తి హక్కు కల్పించిన స్త్రీజనోద్ధారకుడు / ఆడపిల్ల పుడితేనే అల్లాడిపోయే సమాజంలో ఆడపిల్లలే/స్వర్గ సోపానాలని చాటి నలుగురు ఆడపిల్లలని పోషించిన ఆదర్శ తండ్రి" అని మరో కవి అమీనుర్రషీద్ ముహమ్మద్ ప్రవక్త తీసుకొచ్చిన మార్పును అక్షరీకరించారు. "మూఢ నమ్మకాలను తొలగించిన కారుణ్యమూర్తి/ సత్ప్రవర్తనతో పరిపూర్ణత చెందిన ముహమ్మద్ ప్రవక్త." అని కవయిత్రి మోదేపల్లి శీనమ్మ ప్రవక్త పట్ల ప్రేమను చాటుకున్నారు. "ఓ ప్రవక్తా మీకు సలాములు / అనాథగా జన్మించి అనాథలను ఆదుకున్న ఓ ప్రవక్తా మీకు సలాములు/ యుక్త వయసులో వితంతువును వివాహమాడిన ఓ ప్రవక్తా మీకు సలాములు" అంటూ మరో కవయిత్రి అఫ్సరీ బేగం ప్రవక్త పట్ల ప్రేమను చాటుకున్నారు.

ఇలా కవి సమ్మేళనానికి హాజరైన కవులందరూ ముహమ్మద్ ప్రవక్త వైశిష్ట్యాన్ని, త్యాగాలను వివరించే కవితలను, గేయాలను చదివి వినిపించారు. హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ సమావేశ మందిరంలో అక్టోబర్ 20న జరిగిన ఈ కవి సమ్మేళనానికి కులమతాలకతీతంగా తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి కవులు విచ్చేశారు. ఇదారె అదబె ఇస్లామీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కవిసమ్మేళనానికి ఆ సంస్థ తెలంగాణ అధ్యక్షులు ముహమ్మద్ షోయెబ్ ఉల్ హఖ్ తాలిబ్ సభాధ్యక్షత వహించారు. ఆలపాటి కవితలను సమీక్షించారు. ప్రముఖ సినీ గేయ రచయిత సాధనాల వెంకటస్వామి, ప్రముఖ నవలా రచయిత్రి యలమర్తి అనురాధ, ప్రముఖ కవయిత్రి గిడుగు కాంతికృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కవి సమ్మేళనాన్ని డాక్టర్ ఆలపాటి గారి సమీక్ష అందరినీ ఆకట్టుకుంది. ఎంతో ఆహ్లాదకరమైన సుహృద్భావ వాతావరణంలో ప్రముఖ కవి, రచయిత అబ్దుర్రషీద్ గారి నిర్వహణలో సాగిన ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులందరికీ ప్రశంసాపత్రం, మెమెంటోతోపాటు శాలువాతో సత్కరించారు.

# పావలా మహాత్మ్యం



- ముహమ్మద్ వహీదుద్దీన్, సిద్దిపేట

**ముల్లా అహ్మద్ జీవన్** భారతదేశాన్ని పరిపాలించిన మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ గురువు. ఔరంగజేబు తన గురువును ఎంతగానో గౌరవించేవారు. గురువు కూడా తన శిష్యునిపై గర్వపడేవారు. ఔరంగజేబ్ భారతదేశానికి చక్రవర్తి అయిన తరువాత తన సేవకునితో ఒకసారి ఢిల్లీ సందర్శించి, తనకు సేవ చేసుకునే అవకాశం కల్పించాల్సిందిగా తన గురువు గారికి కబురు పంపారు. యాధృచ్ఛికంగా అది రమజాన్ మాసం. మదర్సా విద్యార్థులకు కూడా సెలవులు దొరికాయి. కనుక ముల్లా అహ్మద్ జీవన్ దిల్లీ పయనమయ్యారు. ఢిల్లీలోని జామియా మస్జిద్ అసర్ నమాజ్ తరువాత గురు, శిష్యులు ఒకరినొకరు కలుసుకున్నారు. ఔరంగజేబ్ గురువుగారిని తన వెంట రాజమహలుకు తీసుకుని వెళ్ళారు.

రమజాన్ మాసమంతా గురుశిష్యులు కలసి ఒకే చోట గడిపారు. ఈద్ నమాజ్ అనంతరం గురువుగారు ఇక తాను తన ఇంటికి వెళతానని తన శిష్యుడయిన ఔరంగజేబును కోరారు. చక్రవర్తి తన జేబు నుంచి ఒక పావలా తీసి తన గురువుగారికి ఇచ్చారు. గురువు గారు దాన్ని చాలా సంతోషంగా స్వీకరించి ఇంటికి బయలు దేరారు. ఆ తరువాత ఔరంగజేబ్ దక్కన్ ప్రాంతంలో యుద్ధాలు చేయడంలో నిమగ్నమయిపోవడం వల్ల పద్నాగేళ్ళపాటు దిల్లీకి రాలేకపోయారు. అయిన దిల్లీ తిరిగి వచ్చిన తరువాత అక్కడి ప్రధాని ఔరంగజేబ్లో "ముల్లా అహ్మద్ జీవన్ గారు పెద్ద భూస్వామి అయ్యారని, అనుమతిస్తే ఆయన వద్ద పన్ను వసూలు చేస్తామ"ని అన్నారు. అది విని ఔరంగజేబ్, ఒక నిరుపేద అయిన గురువు గారు భూస్వామి ఎలా అయ్యారని అవాక్కయ్యారు. ఆయన తన గురువు గారికి లేఖ రాసి 'మిమ్మల్ని కలుసుకోవాలనుకుంటున్నానని తెలిపారు.

ముల్లా జీవన్ అహ్మద్ మునుపటి మాదిరిగానే రమజాన్ మాసంలో దిల్లీకి విచ్చేశారు. ఔరంగజేబ్ గురువు గారికి ఘన స్వాగతం పలికి రాచమర్యాదలతో తన వద్ద ఆతిథ్యం ఇచ్చారు. ముల్లా అహ్మద్ దుస్తులు, మాటతీరు, స్వభావం మునుపటి మాదిరిగానే చాలా సాదాసీదాగానే ఉన్నాయి. కనుక చక్రవర్తి తన గురువుగారిని అంతపెద్ద భూస్వామి ఎలా అయ్యారో తెలుసుకోవాలనే ధైర్యం ఆయనకు చాల లేదు. ఒక రోజు ముల్లా గారు తానే స్వయంగా చెప్పుకొచ్చారు. మీరు ఇచ్చిన పావలా చాలా శుభప్రదమయింది. దాంతో నేను పత్తి విత్తనాలు కొని పొలం వేశాను. అల్లాహ్ అందులో ఎంత అనుగ్రహం ప్రసాదించాడంటే కొన్నేళ్ళలోనే నేను సంపన్నుడినయ్యాను అని తెలిపారు. అది విని ఔరంగజేబ్ చాలా సంతోషించి, చిరునవ్వు నవ్వారు. ఇలా అన్నారు, మీరు అనుమతిస్తే ఆ పావలా కథ మీకు తెలుపుతాను అని అనుమతి అడిగారు. దానికి ముల్లా తప్పకుండా తెలపమన్నారు.

వెంటనే చాంద్నీ చౌక్లోని ఉత్తమ్ చంద్ను ఫలానా తేదీ నాటి ఖాతా వివరాలు తీసుకురావలసిందిగా తన సేవకుడిని ఆదేశించారు ఔరంగజేబ్. సేవకుడు అతన్ని తీసుకువచ్చాడు. ఉత్తమ్ చంద్ సాధారణ వ్యాపారి. చక్రవర్తి నుంచి పిలుపు రావడంతో

అతను భయంతో కంపించిపోసాగాడు. ఔరంగజేబ్ అతనితో మృదువుగా మాట్లాడుతూ.... భయపడకు, ఇటురా! భయపడ కుండా నీ ఖాతాలోని ఖర్చుల వివరాలు తెలియజెయ్యి అని ఆదేశించారు. అతను తన ఖాతా వివరాలు తేదీలతో సహా తెలుపనారంభించాడు. ముల్లా అహ్మద్ జీవన్, ఔరంగజేబ్ ఆ వివరాలను మౌనంగా వినసాగారు. ఒక ఖాతా దగ్గరకు వచ్చి సేఠ్ మౌనంగా ఉండిపోయాడు. అక్కడ "ఒక పావలా ఖర్చు" అని రాసి ఉంది. తీసుకున్న వ్యక్తి పేరు రాసి లేదు. ఔరంగజేబ్ మృదువుగా 'ఆ పావలా ఎవరు తీసుకున్నారు?' అని అడిగారు. ఉత్తమ్ చంద్ తన ఖాతాను మూసివేసి అనుమతిస్తే ఆ వ్యధా భరిత గాథను వివరిస్తాను అని అనుమతి కోరాడు. చక్రవర్తి అతనికి అనుమతి ఇచ్చారు. ఉత్తమ్ చంద్ చెప్పనారంభించాడు.


మహారాజా! ఒక రోజు రాత్రి కుండపోత వర్షం కురుస్తోంది. నా ఇంటి పైకప్పు నుంచి నీరు కారసాగింది. కొత్తగా కడుతున్న ఇల్లు. ఇంకా పూర్తవలేదు. ఖాతాల వివరాలన్ని ఆ ఇంట్లోనే ఉన్నాయి. నేను నీళ్ళు ఇంటిలోనికి రాకుండా ఉండడానికి చాలా ప్రయత్నాలు చేసాను. కాని నా వల్ల కాలేదు. ఒక సారి ఇంటి బయట తొంగి చూసాను. ఒక వ్యక్తి దీపం వెలుగులో కనబడ్డాడు. నేను అతన్ని కూలీవాడు అనుకుని 'సోదరా!' కూలీ పని ఉంది చేస్తావా? అని అడిగాను. అతను 'చేస్తాను' అన్నాడు. వచ్చి పని చేయడం ప్రారంభించాడు. సుమారు మూడు లేదా నాలుగు గంటల వరకు పనిచేశాడు. పైకప్పు కారడం ఆగిపోగానే అతను ఇంటి సామానంతా సర్దాడు. ఇంతలో ఉదయపు అజాన్ మొదలయింది. అతను 'సేఠ్ గారు మీ పని పూర్తయింది. ఇక నాకు అనుమతించండి, నేను వెళ్ళిపోతాను' అన్నాడు. నేను అతనికి కూలీ ఇచ్చే ఉద్దేశంతో జేబులో చెయ్యి వేశాను. పావలా చేతికి తగిలింది. నేను అతనితో 'సోదరా!' ప్రస్తుతం నా వద్ద ఈ పావలాయే ఉంది. ఉదయాన్నే నా దుకాణానికి వచ్చేయ్యి, నీకు కూలీ డబ్బులు ఇస్తాను' అన్నాను. దానికి అతను ' ఈ పావలా నాకు సరిపోతుంది. నేను మళ్ళీ రాలేను' అన్నాడు. నేను, నా భార్య అతనికి చాలా చెప్పి చూశాము. కాని అతను ససేమీరా అన్నాడు. ఇవ్వదలచుకుంటే ఆ పావలా ఇవ్వండి లేదంటే అది కూడా మీరే ఉంచుకోండి అన్నాడు. చేసేది లేక నేను ఆ పావలాయే అతనికి ఇచ్చేశాను. అది తీసుకుని అతను వెళ్ళి పోయాడు. తరువాత అతను కలవలేదు. ఇప్పటికి గడచి పోయాయి. నా మనస్సు నన్ను ఇప్పటికీ నిందిస్తూనే ఉంటుంది, అతనికి కనీసం అర్థ రూపాయి అయినా ఇచ్చి ఉండాల్సింది అని.... చెప్పడం ముగించాడు. ఆ తరువాత ఉత్తమ్ చంద్ రాజు గారి అనుమతి తీసుకుని అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఔరంగజేబ్ తన గురువు గారు ముల్లాతో 'ఇది ఆ పావలాయే' అని అన్నారు. ఎందుకంటే "ఆ రోజు నేను ప్రజల బాగోగులు చూడడానికి మారు వేషం వేసుకుని వెళ్ళాను. నేను అతని ఇంట్లో కూలీ వానిగా పని చేశాను" అని చెప్పుకొచ్చారు. ముల్లా గారు చాలా సంతోషం వ్యక్తం చేసి, "ఈ పావలా నిష్ఠాతుడైన నా శిష్యుడు తన కృషితో సంపాదించి ఉంటాడని నాకు ముందుగానే అనిపించింది" అన్నారు. దానికి రాజు, 'అవును, నాకు సంతోషంగా ఉంది. నా వల్ల ఒక అవసరార్థుని అవసరం తీరింది. ఇదంతా మీ దుఆల ప్రతిఫలమే" అన్నారు.

# మానవతా విలువలు దూరం అవుతున్నాయి




ప్రజల మధ్య ప్రేమ, అనురాగాలు, స్నేహం, మానవతా విలువలు దూరమై ప్రతీకారం, విద్వేషాలు ప్రజ్వరిల్లుతున్న నేటి సమాజంలో నైతికత, విలువల స్థాపనకు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బోధనలు మార్గదర్శకం చేస్తాయని జమాఅతె ఇస్లామీ హింద్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఖాలిద్ ముబషిర్ జఫర్ అన్నారు. అక్టోబరు 20న మహబూబాబాద్ పట్టణంలోని ఎస్ఎస్‌వీఎల్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన దైవప్రవక్త ముహమ్మద్(స) జీవిత చరిత్ర–బోధనలపై జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రవక్త(స) బోధనల గొప్పతనాన్ని, నేటి సమాజం ఏ రకంగా అనుసరించాలో తెలిపారు. ప్రవక్త(స) పేదలు, అనాథలు, వితంతువులు, స్త్రీల పట్ల ప్రదర్శించిన గౌరవ మర్యాదలను నేటి సమాజం తెలుసుకొని ఆచరించవలసిన అవసరముందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నయీముద్దీన్ అహ్మద్, అబ్దుల్ హలీం, ఎం.ఎన్. బేగ్ జాహెద్, అలీముద్దీన్, ఇర్షాద్, ఇష్రత్ భానులు ప్రసంగిస్తూ, ప్రవక్త (స) బోధనల ద్వారా సమాజంలో నైతిక విలువలు, మానవ జీవన విధానం సంపూర్ణమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మహబూబాబాద్ పట్టణ అధ్యక్షులు ముహమ్మద్ ఇక్బాల్, జిల్లా బాధ్యులు అబ్దుల్ సత్తార్, పట్టణ ముస్లిం పెద్దలు, మస్జిద్ ఇమాములు, ప్రజలు పాల్గొన్నారు.




**పూర్వం** ఒక రాజు తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఎంతమంది వైద్య నిపుణులు రాజగారికి చికిత్స చేసినా రాజుగారి వ్యాధితీవ్రత తగ్గడం లేదు. అంతలోనే ఇబ్నెసీనా అనే యువకుడు రాజుగారికి వైద్యం చేసి రాజుగారి రోగాన్ని నయం చేశాడు. రాజుగారు ఎంతో సంతోషించి 'ఏమి కావాలో కోరుకో నాయనా' అన్నారు. ఆ సమయంలో ఏం కోరుకున్నా రాజుగారు ఇచ్చేంత సంతోషంలో ఉన్నారు. కానీ ఆ యువకుడు "రాజుగారూ, మీ రాజ గ్రంథాలయంలో రోజూ కాసేపు పుస్తకాలు చదువుకునే అనుమతివ్వండి" అని వేడుకున్నాడు. ఆ యువకుడు రోజూ ఆ గ్రంథాలయానికి వెళ్లి పుస్తకాలు అధ్యయనం చేసేవాడు. చివరికి ఒక పెద్ద శాస్త్రవేత్తగా మారాడు. అవిసీనాగా పిలువబడే ఇతను ఆధునిక వైద్య పితామహుడిగా పేరుప్రఖ్యాతలు సాధించాడు. ఈ గాథ విద్యాజ్ఞానాలు ఎంత విలువైనవో స్పష్టం చేస్తున్నది. ఆ రోజు ఆ యువకుడు వెండి, బంగారు, వజ్ర వైఢూర్యాలు కోరుకుని ఉంటే శాస్త్రవేత్తగా పేరుప్రఖ్యాతలు సంపాదించేవాడు కాదు. శతాబ్దాలు గడిచినా అతని పరిశోధనలు, అతని గ్రంథాల ద్వారా విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారు.

విద్య మనిషికి వెలుగులా దారి చూపుతుంది. విద్యాజ్ఞనాలు వెలుగుకు సంకేతమైతే, అవిద్య అంధకారానికి నిదర్శనం. విద్యను అర్జించడం ఉత్తమమైన ఆరాధనతో సమానమని ప్రవక్త చెప్పారు. తాను చేసేది మంచో చెడో విద్యాజ్ఞానాల వల్లే తెలుస్తుంది. "విద్యా జ్ఞానాలు కలవారు, విద్యా జ్ఞానాలు లేనివారు ఇద్దరూ ఎన్నటికీ సమానులు కాలేర"ని ఖుర్ఆన్ 'చదువు' ప్రాముఖ్యతను తెలియజేసింది. ఏవిధంగానైతే వెలుగు-చీకటి రెండు ఎన్నటికీ ఒక్కటి కాలేవో. ఇస్లామ్ విద్యా జ్ఞానాలను అర్జించడాన్ని ప్రోత్సహించింది. "నాకు మరింత విద్యాజ్ఞానాలను ప్రసాదించు ప్రభూ" అని వేడుకోమని అల్లాహ్ ముహమ్మద్ ప్రవక్తకు వేడుకోలును నేర్పాడు. మనిషి ఎంతటి విజ్ఞానవంతుడవుతాడో అంతగానే అతనికి మేళ్లు సమకూరుతాయి. "విద్య సంపదకంటే ఎంతో మేలైనది. ఎందుకంటే డబ్బును మీరు భద్రపరచాల్సి వస్తుంది. కానీ మనం నేర్చుకున్న విద్యాజ్ఞానాలే మనకు రక్షణగా నిలుస్తాయి. డబ్బు ఖర్చు పెడితే తరిగిపోతుంది. విద్యను ఎంతగా పంచిపెడితే అంతగానే పెరుగుతుంది." అని హజ్రత్ అలీ (రజి) తెలిపారు. మన అవసరాలు తీర్చుకునేందుకు, భార్యా బిడ్డలను పోషించుకునేందుకు, మంచి ఇల్లు కట్టుకునేందుకు డబ్బును సంపాదిస్తాము. ఎవరి అవసరం మేర, ఎవరి శక్తిమేర వాళ్లు సంపాదించుకుంటారు. మన కష్టార్జితం దొంగల పాలవ్వకూడదనే ఉద్దేశంతో సంపాదించిన డబ్బును బ్యాంకు లాకర్లల్లో, ఇళ్లల్లో భద్రపరుస్తాము. ఆ డబ్బును కాపాడుకునేందుకు రాత్రింబవళ్లు మనశ్శాంతి లేకుండా గడుపుతాము. కానీ మనం అర్జించిన విద్య నిత్యం మనకు రక్షణగా ఉంటుంది. మనం పంచి పెట్టిన విద్య మన తదనంతరం కూడా మనకు కీర్తి ప్రతిష్ఠల్ని తెచ్చిపెడుతుంది. నేర్చుకున్న జ్ఞానం మనకు అడుగడుగునా మార్గదర్శకం చేస్తుంది. ఏది మంచి మార్గం, ఏది చెడ్డ మార్గమో చూపుతుంది. అందుకే ఖుర్ఆన్ గ్రంథం జ్ఞానాన్ని వెలుగుతో సరిపోల్చింది. ఏవిధంగానైతే

సూర్యుడును వెలుగును విరజిమ్మి చీకటిని పటాపంచలు చేస్తాడో విద్యాజ్ఞానాలు కూడా మనిషికి దారి చూపుతాయి. అజ్ఞానాన్ని దూరం చేస్తుంది. అందుకే విద్యార్జన ప్రతీ స్త్రీ పురుషునిపై విధిగా చేయబడింది. నేర్చుకున్న విద్య తనకూ, నలుగురికీ మేలు చేయగలిగిన విద్యయే నిజమైన విద్య. 'విద్య నా ఆయుధం' అని పేర్కొన్నారు ముహమ్మద్ ప్రవక్త(స). బద్ర్ యుద్ధంలో ముహమ్మద్ ప్రవక్త(స) విజయం సాధించారు. అందులో 70మంది ఖైదీలు బందీలుగా పట్టుబడ్డారు. అందులో విద్యావంతులు ఉన్నారు. అందులో ఒక్కో ఖైదీ మదీనాలోని పది మంది పిల్లలకు చదువు చెప్పే షరతుతో విముక్తి చేస్తామన్నారు. విద్యా జ్ఞానాలంటే కేవలం ధార్మిక విద్య మాత్రమే కాదని ఇక్కడ బోధపడుతోంది. మేలు చేసే ఎలాంటి విద్యనైనా నేర్చుకోవాలన్నది ఈ సంఘటన రుజువుచేస్తుంది. సమాజానికి మేలు చేసే ఎలాంటి విద్యను అర్జించినా అది దైవారాధనలతో సమానమన్నది ప్రవక్త ఉద్బోధ. 'చదువు నీ ప్రభువు పేరుతో' అనే వాక్యంతోనే ఖుర్ఆన్ అవతరణ ప్రారంభమవ్వడం విశేషం.

# స్వర్గానికి 8 ద్వారాలు

**పర్వీన్ సుల్తానా**

**స్వర్గానికి** ఎనిమిది "తలుపులు" లేదా "ద్వారాలు" ఉన్నాయని హదీసుల ద్వారా తెలుస్తోంది. ప్రతి స్వర్గ ద్వారానికి ఒక పేరు ఉంది. అది దాని ద్వారా అనుమతించబడే వ్యక్తులు ఎవరో వివరిస్తుంది. కొందరు పండితుల ప్రకారం ప్రధాన ద్వారంలోకి ప్రవేశించిన తర్వాత, ఈ ద్వారాలు కనిపిస్తాయి. స్వర్గ ద్వారాల ఖచ్చితమైన స్వభావం తెలియదు, వాటి పేర్లను ప్రవక్త ముహమ్మద్(స) పేర్కొన్నారు.

## స్వర్గ ద్వారాలు

1. **బాబ్ అస్-సలాత్** : సమయానికి నమాజ్ చేస్తూ, నమాజులో అణకువను పాటించే ముస్లింలకు.

2. **బాబ్ అల్-జిహాద్** : జిహాద్‌లో పాల్గొన్న వారికి

3. **బాబ్ అస్-సదఖా** : తరచుగా దానాలు చేసేవారి కోసం తెరువబడుతుంది.

4. **బాబ్ అల్-రయ్యాన్** : ఉపవాసం ఉండే వారికి (సియామ్).

5. **బాబ్ అల్-హజ్** : హజ్ చేసే ముస్లింల కోసం

6. **బాబ్ అల్-కాజిమీన్ అల్-గైజ్ వల్ ఆఫీనా అనిన్ నాస్** : కోపాన్ని దిగమ్రింగే వారికి, జనులను క్షమించే అలవాటు ఉన్నవారికి.

7. **బాబ్ అల్-ఈమాన్** : హృదయపూర్వక విశ్వాసం ఉన్నవారికి.

8. **బాబ్ అల్-జిక్ర్** : అల్లాహ్‌ను విరివిగా స్మరించుకునేవారి కోసం

"దైవప్రవక్తా(స)! ఎవరయినా ఈ ఎనిమిది ద్వారాల గుండా కూడా స్వర్గంలో ప్రవేశిస్తారా?" అని ఒకసారి మహనీయ అబూబక్ర్(రజి) ప్రశ్నించగా, "అవును. అలాంటి వారిలో నువ్వు కూడా ఉంటావని నేను భావిస్తున్నాను" అన్నారు ప్రవక్త మహనీయులు(స).

మన ఆలోచనా విధానాన్ని మార్చడానికి, మన శాశ్వత నివాసంపై దృష్టి పెట్టడానికి స్వర్గ ద్వారాలను అర్థం చేసుకోవడం అవసరం. విశ్వాసి జీవిత లక్ష్యం తదుపరి శాశ్వత జీవితంలో స్వర్గాన్ని పొందటమై ఉండాలి.




## మదర్సా చట్టాన్ని అలహాబాద్ హైకోర్టు రద్దు చేసి ఉండాల్సింది కాదు

యూపీలోని సుమారు 17లక్షల మంది మదర్సా విద్యార్థులకు సుప్రీంకోర్టు ఉపశమనం కల్పించింది. యూపీ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్టు 2024ను రద్దు చేస్తూ గత నెలలో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. దీంతో రాష్ట్రంలోని 16,000 మదర్సాలు యథావిధిగా కొనసాగనున్నాయి. హైకోర్టు నిర్ణయం ప్రాథమికంగా సరికాదని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. మదర్సా చట్టం 2024 సెక్యులరిజం సూత్రాలను ఉల్లంఘిస్తోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైనది కాదని తెలిపింది. ఈ తీర్పు పదివేల మదర్సా టీచర్లు, 17లక్షల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోందని పేర్కొంది. మదర్సాలో మ్యాథ్స్, సోషల్ స్టడీస్, సైన్స్ సబ్జెక్టులను కూడా మదర్సాల్లో బోధిస్తున్నారని, అక్కడి విద్యార్థులను ఇతర పాఠశాలలకు తరలించే అవసరం లేదని తాము భావిస్తున్నట్లు సీజేఐ పేర్కొన్నారు.

## జనాభా తగ్గుదలపై ఆంధ్ర, తమిళనాడుల్లో కలవరం

దేశంలో జనాభా అపరిమితంగా పెరిగిపోవడంతో 40-50 ఏళ్ల క్రితం దాని నియంత్రణకు కేంద్ర, రాష్ట్రాలు నడుం బిగించాయి. జనాభా నియంత్రణ విధానాలు గట్టిగా అమలు చేశాయి. ముఖ్యంగా దక్షిణ భారతం ఈ విషయంలో ముందంజలో ఉంది. అయితే భవిష్యత్‌లో ఇదే తమకు ముప్పు తెచ్చిపెట్టే పరిస్థితి ఏర్పడిందని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నేతలు ఆందోళన చెందుతున్నారు. వృద్ధుల జనాభా పెరిగిపోతుండగా.. జననాల రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేటు-టీఎఫఆర్.. ప్రతి మహిళ తన జీవితకాలంలో కనే పిల్లల సగటు శాతం) తగ్గిపోతోంది. త్వరలోనే జనాభా లెక్కల సేకరణ ప్రారంభం కానుంది. దక్షిణాది జనాభా తగ్గిపోయే అవకాశం ఉందని.. ఇది వనరుల పంపిణీపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయా రాష్ట్రాలు అంటున్నాయి.

## యోగి సర్కార్ 'బుల్డోజర్ యాక్షన్'పై సుప్రీం వార్నింగ్

ఉత్తరప్రదేశ్‌లోని బహ్రెయిచ్‌లో ఇటీవల మత ఘర్షణల అనంతరం పలువురికి యూపీ అధికారులు కూల్చివేతల నోటీసులు ఇచ్చారు. దీనిని సవాలు చేస్తూ బాధితులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు, జస్టిస్ బీఆర్ గావయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం బుల్డోజర్ చర్యలపై (Bulldozer action) సుప్రీంకోర్టు (Suprme Court) అక్టోబరు 22న ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను అతిక్రమించి ప్రమాదంలో పడతామంటే అది మీ ఇష్టమని వ్యాఖ్యానించింది. అక్రమ కట్టడాలు కూల్చివేతలో తాము జోక్యం చేసుకోమని, అయితే బుల్డోజర్ న్యాయం కుదరదని గతంలో అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ధర్మాసనం గుర్తు చేసింది.

## 77 శాతం చిన్నారులకు పౌష్టికాహారం దూరమే



ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) సూచించినట్లుగా 6-23 నెలల వయస్సు గల 77 శాతం మంది పిల్లలకు(భారత్) పౌష్టికాహారం అందట్లేదని ఓ అధ్యయనం పేర్కొంది. దేశంలోని మధ్య ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని చెప్పింది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఇది మరీ అధికంగా ఉందని చెప్పింది. పిల్లలకు అందించే ఆహార నాణ్యతను అంచనా వేయడానికి కనీస ఆహార వైవిధ్యం (MDD) స్కోర్‌ను ఉపయోగించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. తల్లిపాలు, గుడ్లు, చిక్కుళ్ళు, గింజలతో సహా పోషకాలు కలిగిన ఇతర ఆహార పదార్థాలు అందని వారిని అధ్యయనంలో చేర్చింది. 2019-21 (NFHS-5) నుండి జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే డేటాను విశ్లేషించడం ద్వారా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌తో పరిశోధకులు ఓ విషయాన్ని కనుగొన్నారు.

**సర్వత్రా**

## 109 మందితో ఇండోనేషియాలో జంబో క్యాబినెట్

కొత్తగా ఎన్నికైన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబౌ సుబియంటో 109మంది సభ్యులతో జంబో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేశారు. గత అధ్యక్షుడు జోకో విడుడో ప్రభుత్వంలో 34 మంది మంత్రులే వుండేవారు. తనకు బలమైన పాలనా యంత్రాంగం కావాలని, అందువల్ల తాను ఎక్కువ మందితోనే మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తానని సుబియంటో ఇంతకుముందే ప్రకటించారు. భిన్న సంస్కృతులు కలిగిన, విభిన్నమైన రాజకీయ ప్రయోజనాలు కలిగిన మన సమాజంలో పటిష్టమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నది తన అభిమతమని చెప్పారు. ఇందుకోసం గత వారం ఆయన వందమందికి పైగా ప్రజలను ఇంటర్వ్యూలకు పిలిచారు. ఏడు పార్టీల సంకీర్ణంతో కూడిన ప్రభుత్వంలో అన్ని పార్టీలకు చెందిన ప్రతినిధులు మంత్రివర్గంలో వున్నారు.

## ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలొద్దు!

ఉగ్రవాదం అనే సవాలును ఎదుర్కోవడంలో ద్వంద్వ వైఖరికి తావు లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో అందరూ ఏకతాటిపై నిలిచి, పరస్పరం పటిష్ఠ మద్దతుతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. భారత్ ఎప్పుడూ చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడానికే మద్దతు తెలుపుతుందని.. యుద్ధానికి కాదని చెప్పారు. శాంతి చర్చల ద్వారానే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం లభిస్తుందని పునరుద్ఘాటించారు. కొవిడ్ లాంటి సవాళ్లను సమష్టిగా ఎదుర్కొన్న తరహాలోనే మనమంతా కలిసి భావి తరాలకు భద్రతమైన, పటిష్ఠమైన భవిష్యత్తును అందించేందుకు సరికొత్త అవకాశాలను సృష్టించాలని మోదీ సూచించారు. రష్యాలోని కజాన్ నగరంలో జరుగుతున్న 16వ బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) సదస్సులో ఆయన మాట్లాడారు.

## భూమిపై వ్యవసాయం చేసిన తొలి జీవి చీమ..

ప్రపంచానికి వ్యవసాయాన్ని పరిచయం చేసింది మనుషులేనని ఇప్పటివరకూ చెప్పుకొంటున్నాం. అయితే, మనుషులు పుట్టక ముందే, ఇంకా కచ్చితంగా చెప్పాలంటే 6.6 కోట్ల ఏండ్ల కిందటే చీమలు వ్యవసాయాన్ని చేశాయి. ఇప్పటికీ చేస్తున్నాయి. అలా భూమి మీద వ్యవసాయం చేసిన తొలి జీవిగా చీమ నిలిచింది. ఈ విషయాన్ని అమెరికాలోని స్మిత్ సోనియన్స్ నేషనల్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీ పరిశోధకులు తాజా అధ్యయనం ద్వారా గుర్తించారు. ఈ వివరాలు 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## పాలస్తీనాలో రెట్టింపైన దారిద్ర్యం

పాలస్తీనా భూభాగంలో ఈ ఏడాది దారిద్ర్యం రేటు రెట్టింపై 74.3 శాతానికి చేరిందని ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) పేర్కొంది. మానవ వికాసానికి సంబంధించిన కీలక అంశాలను సమీక్షించే మానవ వికాస సూచిక (హెచ్‌డిఐ)ని విడుదల చేశారు. దీని ప్రకారం 69 ఏళ్ళ సుదీర్ఘ కాలంలో సాధించిన ప్రగతి అంతా ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోయిందని, 1955నాటి పరిస్థితులకు పడిపోయిందని యుఎన్‌డిపి అంచనా వేసింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో పరిస్థితి 16ఏండ్లకు పూర్వం ఎలా వుండేదో అలా వుందని పేర్కొంది. గాజాలోకి మానవతా సాయం రాకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని గాజాలోని ప్రభుత్వ మీడియా కార్యాలయం పేర్కొంది. ఏడాది క్రితం దాడులు ఆరంభమైన తర్వాత ఇప్పటివరకు దాదాపు రెండున్నర లక్షల సహాయ ట్రక్కులను నిలిపివేసిందని పేర్కొంది. ఆకలితో అలమటించి చనిపోవాలన్నదే ఇజ్రాయిల్ వ్యూహంగా వుందని, అందుకే ఆహారం, పాలు, ఇతర పోషక పదార్థాలను లోపలకు రాకుండా అడ్డుకుంటోందని విమర్శించింది. దాడులు ప్రారంభం కాకముందు గాజాలోకి ప్రతి రోజూ దాదాపు 500 ట్రక్కుల సహాయం వచ్చేది. తక్షణమే గాజాలోకి మానవతా సాయం అందేలా చూడాలని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ చీఫ్ ఫిలిప్ లాజారిన్ కోరారు.

## బంగ్లాదేశ్‌లో మళ్లీ టెన్షన్.. టెన్షన్

బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్విగ్న వాతావరణం నెలకొంది. ఆ దేశ ప్రధానమంత్రి షేక్ హసీనా రాజీనామా లేఖ గురించి బంగ్లాదేశ్ అధ్యక్షుడు షహబుద్దీన్ చేసిన వ్యాఖ్యలు అక్కడ తీవ్ర దుమారాన్ని రేపాయి. గత వారం ఓ స్థానిక వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో షహబుద్దీన్ మాట్లాడుతూ.. "ఆగస్టు 5న హసీనా రాజీనామా చేసినట్లు విన్నాను కానీ దాన్ని ధ్రువీకరించేందుకు ఆమె రాజీనామా లేఖ సహా నా వద్ద ఎటువంటి ఆధారం లేదు. ఎంత ప్రయత్నించినా ఆ లేఖ లభ్యం కాలేదు. బహుశా ఆ సమయంలో హసీనాకు రాజీనామా లేఖ ఇచ్చే సమయం దొరకలేదేమో" అని వ్యాఖ్యానించారు. దాంతో ఆందోళనకారులు భగ్గుమన్నారు. అధ్యక్ష భవనం బంగభవన్‌ను ముట్టడించి షహబుద్దీన్ రాజీనామాకు డిమాండ్ చేశారు. పోలీసులు.. ఆర్మీ సిబ్బంది సాయంతో బంగభవన్ దగ్గర పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేశారు. ఆగస్టు 5న త్రివిధ దళాధిపతుల సమక్షంలో అధ్యక్షుడు షహబుద్దీన్ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో హసీనా రాజీనామా చేశారని.. తాను ఆమోదించానని చెప్పారని, ఇప్పుడేమో తన వద్ద రాజీనామా లేఖ లేదని పేర్కొనడం సరికాదని తాత్కాలిక ప్రభుత్వ న్యాయ వ్యవహారాల సలహాదారుడు ఆసిఫ్ నజ్రుల్ దుయ్యబట్టారు.

# సామాజిక స్పృహ

**అస్రా**

**పూర్వం** ఒకానొక రాజు తమ రాజ్యంలో ప్రజల సామాజిక స్పృహను తెలుసుకునేందుకు పలు ఉపాయాలు పన్నేవాడు. ఒకసారి మారు వేషంలో బయటకు వచ్చి దారి మధ్యలో పెద్ద బండరాయిని ఉంచాడు. ఆ బండరాయిని ఎవరు తొలగిస్తారో చూడాలనే ఉద్దేశంతో ఆ పక్కనే ఉన్న చెట్టు పక్కకు వెళ్లి దాగాడు. ఆ దారి గుండా ఎంతోమంది వ్యాపారులు, సంపన్నులు వెళుతూ కనబడ్డారు. ఎవరూ ఆ బండరాయిని తొలగించే ప్రయత్నం చేయకపోగా పైగా రాజుగారిని నానా మాటలు అన్నారు. అంతలో ఒక రైతు కూరగాయల కావిడిని మోసుకుంటూ అటుగా వచ్చాడు. ఆ బండరాయిని చూసి ఆగాడు. తన భుజంపై ఉన్న బరువును పక్కనపెట్టి రాకపోకలకు అడ్డంగా ఉన్న ఆ బండరాయిని తొలగించే ప్రయత్నాలు మొదలెట్టాడు. ఎంతోసేపు చెమటోడ్చిన తరువాత గానీ ఆ బండరాయిని తొలగించాడు. ఆ బండరాయి కింద ఒక చిన్న పెట్టె కనపడింది. అందులో ఎన్నో విలువైన బంగారు నాణాలు చూసి ఆశ్చర్యపోయాడు. వాటితో అందులో ఒక ఉత్తరం కూడా ఉంది. 'ఎవరైతే ఈ బండరాయిని తొలగిస్తారో ఈ నాణేలన్నీ వారి సొంతం' అని రాసిపెట్టి ఉంది ఆ ఉత్తరంలో. ఇతరులకు సౌకర్యాలు కల్పించడంలో మనం పడే శ్రమ మన విజయానికి కారణమవుతుంది. తోటివారికి సౌలభ్యాలు కలగజేయాలే కానీ కష్టాలు కలగజేయకూడదన్నది ఇస్లామ్ బోధన. మనం నడిచే దారిలో బాటసారులకు ఇబ్బంది కల్గించే రాయిరప్పలు, ముళ్లు, దుర్గంధం ఇలా ఏ వస్తువునైనా తొలగించడం కూడా దానంతో సమానమంటారు ప్రవక్త మహనీయులు. దారిలో బాటసారుల రాకపోకలకు ఇబ్బంది కల్గించే దేన్నయినా తొలగించి సౌలభ్యాన్ని కలిగించడం ఎంతో పుణ్యప్రదం. ఇస్లామ్ విశ్వాసమనే వృక్షానికి 70శాఖలున్నాయి. అందులో చివరి కొమ్మ 'దారిలోనుంచి ఏదైనా ఇబ్బంది కల్గించే వస్తువును తొలగించండం' అని చెప్పారు ప్రవక్త(స). నడిచే దారిలో అడ్డంగా ఉన్న వాటిని తొలగించడం విశ్వాసానికి చిహ్నం.

ఒకానొక సారి దారికి అడ్డంగా పెద్ద వృక్షం కూలిపోయింది. ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోసాగారు. దీన్ని గమనించిన ఒకవ్యక్తి దారికి అడ్డంగా పడి ఉన్న ఆ మహావృక్షాన్ని తొలగించి బాటసారులకు సౌలభ్యాలను కలిగించాడు. అతను చేసిన ఈ మంచిపని అల్లాహ్‌కు ఎంతగానో నచ్చింది. అతనికి స్వర్గంలో చోటు కల్పించాడు.' అని ప్రవక్త (స) చెప్పారు. ఈ వ్యక్తి స్వర్గవనాల నీడన తిరగడం నేను చూశాను' అని చెప్పారు ప్రవక్త (స).

ఒకవ్యక్తి ప్రవక్త (స) దగ్గరకు వచ్చి ప్రవక్తా! నా దగ్గర దానం చేయడానికి అంత స్థోమతలేదు. మరి నేనెలా దానం చేయను' అని దీనంగా అడిగాడు. దానికి ప్రవక్త (స) 'నడిచే వీధుల్లోనుంచి ప్రజలకు అవాంతరంగా ఉన్న రాయిరప్ప, ముళ్లకంప, దుర్గంధం తొలగించడం కూడా దానమే' అని అన్నారు. ఈ దానం చేయడానికి ఎలాంటి సొమ్ము అవసరం లేదు. సేవ చేయాలన్న మంచి మనస్సు ఉంటే చాలు.

మనం నడిచే వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న వాటిని తొలగించడం ఎంత ప్రాధాన్యత సంతరించుకుందో పై గాథ తెలియజేస్తుంది.

కానీ మనలో చాలామంది సౌలభ్యాలను కలగచేయకపోగా కష్టాలను కలిగిస్తుంటారు. వీధుల్లో, బజారుల్లో తమ వాహనాలను రోడ్డుకు మధ్యలో నిలిపి రాకపోకలకు అంతరాయం కల్గించడం, తప్పుడు మార్గంలో వెళ్లడం చేస్తుంటారు. దుర్గంధాన్ని నడివీధిలో పారేయడం చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల వచ్చిపోయేవారికి ఇబ్బంది కలుగుతుంది. నేడు చాలామంది తమ ఇంటి చబుత్రాలను, మెట్లను వీధి మార్గాన్ని ఆక్రమించుకుని కడుతుంటారు. ఇలా చేయడం వల్ల వీధులు పల్చబడి రాకపోకలకు తీవ్ర అవాంతరాలు ఏర్పడతాయి. ప్రజలు నడిచే వీధుల్లో సౌలభ్యాలు కలగచేయకపోయినా పర్వాలేదు కానీ వీధుల్లో అవాంతరాలు సృష్టించరాదు. ఇలా చేయడం వల్లనే నగరాల్లో వీధులన్నీ కుంచించుకుపోతున్నాయి. ఇళ్లను నిర్మించుకునే వారూ నిబంధనలను అతిక్రమించి పార్కింగ్ లేకుండా నిర్మిస్తున్నారు. తమ వాహనాలను యధేచ్ఛగా రోడ్లపైనే నిలుపి రాకపోకలకు తీవ్ర అంతరాయం సృష్టిస్తున్నారు. ఒకప్పుడు 20 అడుగుల వీధి ప్రజల కురచబుద్ధితో కుంచించుకుపోతుంది. ఇక ఇలాంటి వీధుల్లో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే పరిస్థితి ఊహిస్తేనే భయంకరంగా ఉంటుంది. మంటలను ఆర్పే వాహనం కానీ ఆంబులెన్సు వాహనం సకాలంలో రావడానికి కూడా వీలు లేకుండా ఉంటుంది. జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. చాలామంది పనికిరాని వాహనాలను సంవత్సరాల తరబడి రోడ్లపైనే ఉంచుతారు. మనం నడిచే దారిలో సౌలభ్యాలు కలిగించకపోయినా ఇక్కట్లను మాత్రం కలిగించ కూడదు. మనం నడిచే దారిలో పూలుపరవకపోయినా ముళ్లను మాత్రం పర్చకండి.

## పాదచారులు ఏం చేయాలంటే..

➢ దారిలో నడిచి వెళ్లేటప్పుడు చూపులు కిందికి వాల్చి నడవాలి

➢ దారికి అడ్డంగా ఉన్న వ్యర్థాలను, నష్టాన్ని చేకూర్చే రాయిరప్ప, ముళ్లకంపను తొలగించాలి.

➢ దారిలో కనబడ్డవారికి సలామ్ చేయాలి. ఎవరైనా సలామ్ చేస్తే జవాబివ్వాలి.

➢ దారితప్పిన వారికి దారి చూపించాలి.

➢ మనం ఉండే మొహల్లాలు, వీధులు, బజారులను పరిశుభ్రంగా ఉండేలా చూడాలి.

➢ ఇతరులకు అవాంతరాలు కలిగించకుండా అవాంతరాలను తొలగించేవారిగా మారాలి.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**